# 17

# అభివందనములు మరియు విశేషాంశములు

## కొలొస్సయులకు 4:10-18

కొలొస్సయులకు 4:10–14లో చేర్చబడిన పౌలు తోటిప్రయాణికులందరు, "యూస్తు అని పిలువబడిన యేసు" తప్ప, ఫిలేమోను 23, 24 వచనములో కూడా పేర్కొనబడియున్నారు. ఇటువంటి వారి పెద్ద జాబితా నొకటి పౌలు రెండు ఇతర పత్రికలలో మాత్రమే వ్రాసాడు (రోమీయులకు 16:1–23; 1 కొరింథీయులకు 16:10–20). ఆయన తన అభివందన పలుకులు పంపినవారి జాబితా ఈ పత్రికలు తెలియజేయుచున్నవి, కానీ కొలొస్సీ పత్రికలో ఆయన తనతో కూడా రోమా పట్టణంలో ఉండినవారి అభివందనములను కొలొస్సయులకు పంపించుచున్నాడు. వీరందరు ఆయనకు ఉపచారము చేసారు, ఆయనతో కూడ ఇతరులకు ఉపదేశములు చేసారు, బహుశా ఆయనతో కూడ చెరసాలలో ఉండి యుండవచ్చును. పౌలు తన ఉత్తరమును వ్రాయుచుండినప్పుడు వీరందరు ఆయనతో కూడ ఉండినట్లయితే, అభివందనములు పంపించుచుండినవారి జాబితాలో ఆయన వారిని కూడ చేర్చవలెనని వారి ఆసక్తిని నిశ్చయముగా కనుపర్చి యుందురు.

పౌలు తోటి పనివారు ఆరుగురు వారి వ్యక్తిగత అభివందనములు పంపించారు. తిమోతి పేరు పౌలు పేరుతో కూడ కొలొస్సయులకు 1:1లో చేర్చబడి యున్నందున ఇచ్చట చేర్చబడలేదు. 10వ వచనము అతని బంధువైన మార్కును గుర్తిస్తూ బర్నబాను పేర్కొనుచున్నది.

ఎవరినుండైతే పౌలు వారి అభివందనములు పంపించాడో మొదటి ముగ్గురు సహోదరులు యూదీయ నేపథ్యముగలవారై యున్నారు ("వీరు సున్నతి పొందినవారిలో చేరినవారు"; 11వ వచనము). వారు మాత్రమే పౌలుతో కూడ పనిచేయుచుండిన తోటి యూదీయ క్రైస్తవ పనివారై యుండిరి. పౌలు జాబితాలోని తరువాత ముగ్గురు తోటిపనివారు సున్నతి పొందనివారై యున్నారు; అనగా, వారు విశ్వాసులై యుండిన అన్యజనులని స్పష్టమగుచున్నది.

వారు యూదులై యుండినా, అన్యజనులై యుండినా, ప్రభువు నిమిత్తము, అందరు వారి హస్తములను ఆయన హస్తములతో జోడించి శ్రమించారని కొలొస్సయిలోని విశ్వాసులకు అభయమిచ్చుటకు తన తోటి పనివారి మధ్య పౌలు ఈ తారతమ్యమును చూపించి యుండును. యూదీయ క్రైస్తవులు చూపినంత కాకపోయినా, సువార్త ప్రకటనలో అన్యజనులై యుండిన క్రైస్తవులు సహితము యూదీయ క్రైస్తవులు ప్రయాసపడినంత ప్రగాఢంగా ప్రయాసపడ్డారని వారికి తెలియజేయుట మంచిదని పౌలు బహుశా భావించియుండును.

కొలొస్సీ సంఘము, అత్యధికంగా సున్నతి పొందని సభ్యులుండిన సంఘము, వారి తోటి అన్యజనులు యేసును సేవించుచున్నారని ప్రోత్సాహింపబడవలెను. పౌలు కేవలము యూదీయ విశ్వాసుల మధ్యనే కాదు, కానీ క్రీస్తునంగీకరించిన వారందరితో, వారందరికీ అందుబాటులో ఉంటూ పరిచర్య చేయుచుండెను. వారందరు "దేవుని రాజ్యము" నిమిత్తము

ఆయనతో కూడ కలిసి శ్రమించినవారే (4:11).

కొలొస్సయులకును ఫిలేమోనుకును వ్రాయబడిన పత్రికలలోని క్రైస్తవుల జాబితాలలో గల పోలికలను మరియు వ్యత్యాసములను డేవిడ్ ఎమ్. హే సూచించాడు:

> కొలొస్సయులకు 4 వలెనే, ఫిలేమోను 23-24 వచనాలు ఎపఫ్రా, మార్కు, అరిస్తార్కు, దేమా, మరియు లూకా (అర్ఖిప్పు, ఫిలేమోను 2వ వచనములోను, ఒనేసిము, ఫిలేమోను 10వ వచనములోను పేర్కొనబడి యున్నారు). పంపిన అభివందనములు జాబితా నిచ్చుచున్నది. మరొక ప్రక్క ఫిలేమోను పత్రిక తుకికు, యూస్తు అనబడిన యేసు, లేక సుంఫాను పేర్కొనుటలేదు; మరియు కొలొస్సీ పత్రిక ఫిలేమోను లేక అప్పియ పేరును పేర్కొనుటలేదు.[1]

రెండు పత్రికలలోను ఈ పేర్ల వరుసక్రమము భిన్నముగా నున్నది. వీరందరి పేర్లను పౌలు తన దృష్టికోణములో లేదా చదువరుల దృష్టిలో నుండిన వారి ప్రాముఖ్యత ప్రకారము వ్రాసియుండవచ్చును. ఫిలేమోను 23, 24లో ఆయన వారి పేర్లను పేర్కొనిన వరుసక్రమము ఇలా వున్నది: ఎపఫ్రా, మార్కు, అరిస్తార్కు, దేమా, మరియు లూకా. కొలొస్సయులకు 4:10-14లో అరిస్తార్కు, మార్కు, యూస్తు అనబడిన యేసు, ఎపఫ్రా, లూకా, మరియు దేమా మొ॥ వారి పేర్లు తుకికు మరియు ఒనేసిము తరువాత పేర్కొనబడి యున్నవి.

## తోటి పనివారు పంపిన అభివందనములు (4:10-14)

**10నాతోకూడ చెరలో ఉన్న అరిస్తార్కును, బర్నబాకు సమీపాజ్ఞాతియైన మార్కును మీకు వందనములు చెప్పుచున్నారు; ఈ మార్కును గూర్చి మీరు ఆజ్ఞలు పొందితిరి, ఇతడు మీయొద్దకు వచ్చినయెడల ఇతని చేర్చుకొనుడి. 11మరియు యూస్తు అను యేసుకూడ మీకు వందనములు చెప్పుచున్నాడు. వీరు సున్నతి పొందినవారిలో చేరినవారు, వీరుమాత్రమే దేవుని రాజ్యము నిమిత్తము నా జత పనివారై యున్నారు, వీరివలన నాకు ఆదరణ కలిగెను. 12మీలో ఒకడును క్రీస్తుయేసు దాసుడునైన ఎపఫ్రా మీకు వందనములు చెప్పుచున్నాడు; మీరు సంపూర్ణులును, ప్రతి విషయములో దేవుని చిత్తమునుగూర్చి సంపూర్ణాత్మ నిశ్చయతగలవారునై నిలుకడగా ఉండవలెనని యితడెల్లప్పుడును మీకొరకును తన ప్రార్థనలలో పోరాడుచున్నాడు. 13ఇతడు మీకొరకును, లవొదికయవారి కొరకును, హియెరాపొలివారికొరకును బహు ప్రయాసపడుచున్నాడని యితనిని గూర్చి సాక్ష్యమిచ్చుచున్నాను. 14లూకా అను ప్రియుడైన వైద్యుడును, దేమాయు మీకు వందనములు చెప్పుచున్నారు.**

### "నాతో కూడ చెరలో ఉన్న అరిస్తార్కును, ... మీకు వందనములు చెప్పుచున్నాడు" (4:10)

ఉత్తమ పరిపాలకుడు అను అక్షరార్థమిచ్చు **అరిస్తార్కు**, మాసిదోనియలోని థెస్సలొనీకయ వాస్తవ్యుడై యుండెను ఆయన తన మూడవ మిషనెరీ ప్రయాణంపై వెళ్లినప్పుడు అరిస్తార్కు పౌలుతో కూడ ఎక్కువ సమయం ప్రయాణం చేసాడు. అభివందనములు పంపించుచుండిన వారి జాబితాలో ఈయన పేరు మొట్టమొదట వ్రాస్తున్నాడంటే, పౌలు ఆయనను ఎంతగా గౌరవించుచున్నాడో స్పష్టమగుచున్నది. ఈయన పౌలును మొదటిసారి కలిసికొనిన తరువాత

ఆయనతో అత్యంత సన్నిహితమైన సంబంధమును అభివృద్ధిచేసికొని యుండును ఏలయనగా పౌలుతో కూడ రోమా వరకు నౌకాయానం చేసినవారిలో ఈయన మరియు లూకా మాత్రమే ఉండియుందురు (అపొస్తలుల కార్యములు 27:2).

నాతో కూడ చెరలో ఉన్న (*sunaichmalōtos mou*) అను పదజాలమును, అక్షరార్థముగా అనువదించినట్లయితే, అరిస్తార్కు పౌలు యొక్క "తోటి యుద్ధఖైదీ" అని అతనిని వర్ణించును. రోమీయులకు 16:7లో పౌలు యొక్క రక్తసంబంధులైన అంద్రొనీకు మరియు యూనీయ మొ॥ వారికి ఇదే పదజాలము అన్వయింపబడినదని తెలియుచున్నది. ఆయన ఫిలేమోనుకు వ్రాసిన ఉత్తరములో, పౌలు ఎపఫ్రా గూర్చి చెప్పాడు, కానీ అదే విధంగా అరిస్తార్కు గూర్చి చెప్పలేదు. బహుశా, అదే హేతువునుబట్టి – సువార్త ప్రకటించుట – అరిస్తార్కు కూడ పౌలుతో చెరసాలలో ఉండెనను ధ్వనింపును కొలొస్సీ పత్రికలోని మాటలు తెలియజేయవచ్చును. ఒకడు యేసును సేవించునట్లు చెరసాలలో వేయబడినాడను భావముతో లేదా ఒక ఆధ్యాత్మిక బందీ అయ్యాడను తలంపుతో, పౌలు దీనిని ఒక అలంకారిక పరిభాషగా ప్రయోగించి యుండును. "ఖైదీ" అను పదమును అర్థరార్థంతో అర్థంచేసికొనుట అత్యధికంగా సంభావ్యమై యుండును. ఆయన యేసు కొరకు పోరాడుచున్నందు వలన చెరసాలలో ఉన్న ఒక సైనికుడైయున్నాడని పౌలు తనను తాను పరిగణించుకొన్నాడు. క్రీస్తు కొరకైన ఈ ఆధ్యాత్మిక యుద్ధములో అరిస్తార్కు కూడ పౌలుతో కలిసి పోరాడుటలో నిమగ్నమై యుండెను.

అరిస్తార్కు మొదట అపొస్తలుల కార్యములు గ్రంథంలో పేర్కొనబడియున్నాడు. పౌలుకు విరోధముగా అల్లర్లు చెలరేగినప్పుడు ఆయన ఎఫెస్సులో ఉండెను. ఆయన మరియు గాయి ఒక ప్రజా మూక చేత పట్టబడిరి, ఒక నాటకశాలలోనికి తీసుకొనిపోబడిరి (అపొస్తలుల కార్యములు 19:29). పౌలుతో కూడా మాసిదోనియ గుండా వెళ్లిన తరువాత, పౌలు నిమిత్తము వేచియుండుటకు అక్కడ నుండి ఆయన ఇతరులతో కూడ పౌలు కంటె ముందుగా త్రోవకు వెళ్లెను (అపొస్తలుల కార్యములు 20:4, 5). అక్కడ నుండి ఆయన మరియు సెకందు థెస్సలొనీకయ నుండి వచ్చిన ప్రతినిధులుగా పౌలు యెరూషలేములోని సహోదరుల కొరకు దాన ద్రవ్యమును తీసికొని వెళ్లినప్పుడు ఆయనతో కలిసి వెళ్లారు (అపొస్తలుల కార్యములు 24:17 చూడుము). రెండు సంవత్సరములు తరువాత (అపొస్తలుల కార్యములు 24:27), ఆయన మరియు లూకా, అప్పటికి ఖైదీగా నుండిన పౌలుతో కలిసి, కైసరయ నుండి రోమా పట్టణమునకు వెళ్లారు (అపొస్తలుల కార్యములు 27:1, 2). ఆయన రోమా పట్టణంలోనే, పౌలుకు ఒక పరిచారకునిగా లేదా పౌలు తోటి ఖైదీగా ఉండిపోయాడు. ఆయన మూర నుండి, పౌలు మరియు లూకా ప్రయాణము కొరకు ఓడలు మారిన స్థలము, థెస్సలొనీకయలోని తన స్వగృహమునకు తిరిగి వచ్చాడని కొందరనుకొనుచున్నారు (అపొస్తలుల కార్యములు 27:5, 6). ఇది సందేహాస్పదమే ఏలయనగా పౌలు కొలొస్సయులకు తన ఉత్తరమును రచించినప్పుడు ఆయన పౌలుతో కూడ రోమా పట్టణంలో ఉండెను.

**"బర్నబాకు సమీపజ్ఞాతియైన మార్కును మీకు వందనములు చెప్పుచున్నాడు,**
**ఈ మార్కును గూర్చి మీరు ఆజ్ఞలు పొందితిరి, ఇతడు మీ**
**యొద్దకు వచ్చిన యెడల ఇతని చేర్చుకొనుడి" (4:10)**

పౌలునకు వలెనే (అపొస్తలుల కార్యములు 13:9), **మార్కు** రెండు నామధేయములు కలిగియుండెను (అపొస్తలుల కార్యములు 12:25). అతని హెబ్రీ పేరు యోహాను – "దేవుడు కృపాసహితమైనవాడు" దీని అక్షరార్థము – మరియు అతని గ్రీకు నామము "మార్కు" అనగా, "ఒక పెద్ద సుత్తె" అని అర్థము. పౌలు అతనిని వాని గ్రీకు పేరుతోనే పిలుచుచుండెను (కొలొస్సయులకు 4:10; 2 తిమోతి 4:11; ఫిలేమోను 24), పేతురు కూడ ఈ పేరుతోనే పిలిచాడు (1 పేతురు 5:13). అరిస్తార్కుతో పాటు, మార్కు కూడ తన అభివందనములు పంపించాడు.

లూకా, మార్కును "మార్కు అని పిలువబడిన యోహాను"గా పరిచయము చేసాడు (అపొస్తలుల కార్యములు 12:12, 25; 15:37 చూడుము) మరియు అటుతరువాత మామూలుగా "యోహాను" అని సంబోధించాడు (అపొస్తలుల కార్యములు 13:5, 13). యెరూషలేములోని క్రైస్తవులు, పేతురు చెరసాలలో వేయబడినప్పుడు ఆయన కొరకు ప్రార్థించుటకు మార్కు తల్లి, మరియు ఇంట కూడుకొన్నారు. చెరసాలలో నుండి విడుదల గావింపబడిన తరువాత పేతురు మరియు ఇంటికి వెళ్లాడు, ఇది క్రైస్తవులు కూడుకొనుటకు గుర్తింపబడిన ఒక కూడిక స్థలమనుటకు ఇదొక సూచనయై యున్నది (అపొస్తలుల కార్యములు 12:12). మార్కు తండ్రి గూర్చి ఏమియు చెప్పబడలేదు.

పౌలు మరియు తన **సమీపజ్ఞాతియైన** బర్నబాతో కూడ మార్కు తన మొదటి మిషనరీ ప్రయాణము మొదలుపెట్టాడు. వారితో కూడ కుప్ర అను ద్వీపములోని సలమీ మరియు పాపు వరకు వెళ్లి, అక్కడ నుండి ప్రధాన భూప్రదేశమైన పంపులియలోని పెర్గే వరకు వెళ్లి (అపొస్తలుల కార్యములు 13:13), తిరిగి యెరూషలేమునకు వచ్చాడు (అపొస్తలుల కార్యములు 13:5–13).

మార్కు తన పని ఎందుకు వదిలిపెట్టాడో ఎవరికిని కచ్చితంగా తెలియదు, కానీ నానావిధ హేతువులు ప్రతిపాదింపబడినవి. నాయకత్వమంతా పౌలె వహించుచు, బర్నబాకు బదులుగా ప్రధాన ప్రసంగీకుడైనందువలన అతడు అసూయచెందాడా? పౌలు యొక్క అనారోగ్యమునకు (గలతీయులకు 4:13–15) మరియు ఏదో ఒక రోగము సోకుటకు గల సాధ్యతలకు భయముచెందాడా? ముఖ్యంగా, 2 కొరింథీయులకు 11:24–27లో పేర్కొనబడినట్లు పౌలు సహించినటువంటి అనేక అపాయములు, తన సొంత ఇంటికి దూరముగా నుండిన యవ్వనుని బెదిరించుచుండినట్లు అగుపించాయా? పనుల సఫలత ఆయన ఆశించినంతగా లేకుండినదా? ఆయన తన సొంత ఇంటికి వచ్చుటకు హేతువు వీటిలో ఏదైనా అయియుండవచ్చును; ఏదిఏమైనా, మొదటి సాధ్యత, అత్యల్ప హేతువై యుండుట సంభావ్యమై యున్నది.

మార్కు తన పనిని ఇంత త్వరగా విడిచిపెట్టినందువలన, మరొక మిషనరీ ప్రయాణములో పాల్గొనుటకు మార్కు సంసిద్ధుడై యుండలేదని పౌలు విశ్వసించాడు. పౌలు మరియు కుప్రీయుడైన బర్నబా (అపొస్తలుల కార్యములు 4:36), మధ్య పదునైన భేదాభిప్రాయములేర్పడుటకు ఇదొక ప్రధాన కారణమయ్యింది, గనుక బర్నబా జ్ఞానయుక్తంగా తన సమీపజ్ఞాతియైన మార్కును సువార్త ప్రకటన నిమిత్తము ఆయనకు సుపరిచితమై స్వస్థలములోని సంస్థానములకు తీసుకొని వెళ్లాడు (అపొస్తలుల కార్యములు 15:39). మార్కు యెడల పౌలుకు ఎటువంటి వైరభావమైనను లేదు. కానీ యవ్వనుడైన మార్కు యింకా

పరిపూర్ణంగా ఎదుగుచు మరి ఎక్కువ సుస్థిరమైన మనస్సుగలవాడు కావలసియుండినదని పౌలు ఆశించుచుండెను. ఈ విషయాన్ని బర్నబా కూడ అర్థం చేసుకొన్నాడు, గనుక ఇతరులను ప్రోత్సాహించవలసిన బాధ్యతాయుతమైన భారము అప్పగింపవాడై, మార్కు పరిపూర్ణ దిశకు ఎదిగి, క్రీస్తు యొక్క ఒక మంచి సేవకునిగా తీర్చిదిద్దబడినట్లు అతనికి సహనముతో సహాయము చేయుటకు మార్కు కూడ ఉండిపోయాడు. ఇదే నిజమైనట్లయితే, బర్నబా ప్రయాసములుసార్థకమైనట్లే యని ఋజువగుచున్నది.

పౌలు ఏవిధమైన పరిచయ వాక్కులు లేకుండానే బర్నబా పేరును పేర్కొనిన తీరు గమనించినట్లయితే, కొలొస్సయిలో నున్న సంఘమునకు బర్నబా ఎంతో సుపరిచితమైనవాడని అది సూచింపవచ్చును, మార్కు కంటే ఎక్కువ పేరుగాంచినవాడని అర్థమగుచున్నది. అలాగైతే, "బర్నబా యొక్క సమీపజ్ఞాతియైన" మార్కు పట్ల సంఘము ఇష్టపూర్వకముగా తక్షణమే ఆసక్తి కనుపర్చును.

మార్కు గూర్చి పౌలు మనస్సులో ఉండిన విషయమై ఈ నాటి చదువరులకు ఎక్కువ వివరములు అవసరమై యుండగా, **ఈ మార్కును గూర్చి మీరు ఆజ్ఞలు పొందితిరి** అని వ్రాయుటలో పౌలు భావమేమై యుండునో, కొలొస్సీ పత్రికను అందజేయుచుండినవారు మరియు దాని గ్రహీతలు కచ్చితంగా అర్థంచేసికొని యుందురు. మార్కు విషయంలో పౌలు అంతకు మునుపు కొలొస్సయులతో ఉత్తరప్రత్యుత్తరములు జరుపుచుండెను గనుక ఆ విషయాలను పౌలు ఈ పత్రికలో పునరుక్తము చేయలేదు. సంఘము మార్కును మార్గనిర్దేశనమునిచ్చుట గూర్చి లేదా ఆయనకు ఇల్లు వాకిలి సమకూర్చుట ద్వారా ఆయన గూర్చి తన శ్రద్ధ వహించవలసిన అవతరతకు సంబంధించి పౌలు తన సలహాను చేర్చియుండవచ్చును.

కొలొస్సయులు మార్కును చేర్చుకొనవలసినదని చెప్పుచూ పౌలు, చేర్చుకొనుడి (*dechomai*) అని రాసాడు. అనగా ఒక సందర్శకునికి లేక ఒక అతిథికి చేయాల్సిన సకల మర్యాదలు చేయవలెనని అర్థము.[2] ఎవరైనా సరే, మర్యాదపూర్వకంగా చేర్చుకొనబడుదురని ధృవపర్చుకొనుటకు ప్రశంసా ఉత్తరములు (2 కొరింథీయులకు 3:1) తరచుగా పంపబడినవి. పరిచయము లేని ప్రయాణికున్ని చదువరులు సంతోషంతో స్వాగతించి అతని బస నిమిత్తము సకల సౌకర్యములను సమకూర్చునట్లు వారిని ప్రోత్సాహించుటకు అతడు చేరాల్సిన స్థలమునకు చేరక మునుపే ఈ ఉత్తరములు పంపబడినవి.

మార్కు తన ప్రయాణముల గూర్చి వేసికొన్న ప్రణాళికలు పౌలుకు కచ్చితంగా తెలియవు, కానీ మార్కు కొలొస్సీ పట్టణమునకు వచ్చినట్లయితే వారు అతనికి ఏయే మర్యాదలు చేయవలెనోయని ఆయన వారికి అదివరకే ఇచ్చిన ఆదేశములను సహోదరులు పాటించవలెనని పౌలు ఆశించాడు. మార్కు విషయంలో పౌలు మరియు బర్నబా మధ్య నెలకొని యుండిన విశ్వాస విభేదముల గూర్చి కొందరు వినియుందురు, గనుక మార్కు యెడల వారు దయగలవారుగా ప్రవర్తించుచు అతనికి అన్ని వసతులు కల్పించవలెనా వద్దా అని ఆశ్చర్యపడుదురు. వారు "మార్కును చేర్చుకొనవచ్చునని" పౌలు వారికి హామీ ఇచ్చాడు. ఆ రోజుల్లో మార్కు పౌలు జతపనివారిలో ఒకడై యుండెను గనుక సమస్త గౌరవమునకును ప్రోత్సాహమునకును అర్హుడై యుండెను. పౌలు కొలొస్సయులకు 4:11లో వ్రాసిన, "వీరి వలన నాకు ఆదరణ కలిగెను" అను వాంగ్మూలములో, యూస్తుతో కూడ మార్కు పేరు

చేర్చబడియుండెను. ఒకానొక దినాన పౌలు చేత తృణీకరింపబడిన యవ్వనుడే ఈనాడు ఆయనకు ఒక ఆశీర్వాదముగాను, ప్రోత్సాహకముగాను తయారయ్యాడు.

పౌలు మరియు మార్కు మధ్య విభేదించి యుండిన సంబంధము పౌలు ఈ ఉత్తరము వ్రాసేనాటికి పునరుద్ధరింపబడినది. చెరసాలలో ఉండిన పౌలును సందర్శించగలుగునట్లు మార్కు రోమా పట్టణమునకు వచ్చి, కొలొస్సయులకును ఫిలేమోనుకును పౌలు తన ఉత్తరములను వ్రాసినప్పుడు ఆయనతో కూడ ఉన్నాడు. గనుక మార్కు ఆయనకు ఒక అంకితమైన "జతపనివాడు" అనియు, అతని గూర్చి ఆయన గర్వించుచున్నాడు గనుక అతనిని సిఫారసు చేయుటకు వెనుకాడడనియు మార్కు గూర్చి వ్రాసాడు (ఫిలేమోను 24). ఫిలేమోనుకు, అప్ఫియకు, మరియు అర్ఖిప్పునకు అభివందనములు పంపిన వారిలో మార్కు పేరును కూడ పౌలు చేర్చాడు (ఫిలేమోను 1, 2, 23, 24), గనుక మార్కు వారిని వ్యక్తిగతముగా కలిసికొన్నాడని ఇది సూచించుచున్నది.

అటుతరువాత, పౌలు మరియు మార్కు కొంత కాలము వేరయ్యారు; కానీ పౌలు రెండవసారి రోమా పట్టణంలోని చెరసాలలో ఉంచబడినప్పుడు, మార్కు సమకూర్చగలిగిన సహాయము గూర్చి ఆయన త్వరగా అర్థంచేసికొన్నాడు గనుక అయనను పిలువనంపించాడు. "మార్కును వెంటబెట్టుకొని రమ్ము, అతడు పరిచారము నిమిత్తము నాకు ప్రయోజనకరమైనవాడు" అని పౌలు తిమోతికి రాసాడు (2 తిమోతి 4:11). మార్కు తిమోతితో కూడ ఎఫెస్సులో లేదా సమీపంలోని కొలొస్సయిలో ఉండియుండును (1 తిమోతి 1:3). మార్కు ప్రయాణమై కొలొస్సయికి వెళ్లాడని లిఖితపూర్వకమైన ఏ నివేదికయు తెలియజెప్పుటలేదు; కానీ అందుబాటులో నున్న సమాచార వివరములన్నిటిని ఒక్కచోట అల్లినట్లయితే, ఆయన అక్కడికి వెళ్లియుండునని మనము సహేతుకముగా సమర్థించవచ్చును.

సమస్త సూచనల ప్రకారము, మార్కు, ప్రభువు నిమిత్తము ఒక గొప్ప పనివాడుగా పరిపూర్ణుడయ్యాడు. అస్థిరమైన ఆరంభముతో తన ప్రేషితోద్యమమును మొదలుపెట్టిన వాని విషయంలో, ఇదొక ముదావహమైన ముగింపై యున్నది. ఆయన పేరు ధరించియున్న సువార్తకు గ్రంథకర్త ఆయనే అని వెలుపటి నిదర్శనము సూచించుచున్నది. మార్కు పేతురుతో కూడ, బహుశా రోమా పట్టణంలో ఉండెనని సూచించుచు, ప్రేరేపింపబడిన లేఖనములలో మార్కు పేరు పేతురు వ్రాసిన పత్రికలో చివరిసారిగా కనిపించుచున్నది (1 పేతురు 5:13).

## "మరియు యూస్తు అను యేసుకూడ మీకు వందనములు చెప్పుచున్నాడు" (4:11)

పౌలు తన జాబితాలో చేర్చిన తరువాత సహచరుడు యూస్తు అని పిలువబడిన యేసు. "యేసు" (*Iēsous*), హెబ్రీ నామము "యెహోషువ" – అక్షరాలా, "దేవుడు రక్షించును" లేక "దేవుడు రక్షకుడై యున్నాడు" అని అర్థము – యొక్క గ్రీకు రూపమై యున్నది. యూదీయ సమాజములలో సుమారుగా సర్వసాధారణమైనదై యున్న ఈ నామము (అపొస్తలుల కార్యములు 13:6), యేసు, లోక రక్షకుడై యున్న యేసు యొక్క అదే నామమై యున్నది. రెండవ శతాబ్దములో ఆచరణయోగ్యంగా ఈ పేరు ఎవరికినీ పెట్టబడలేదు. పౌలుతో కూడ ఉండినవాడు యూస్తు అని కూడ పిలువబడ్డాడు, యూదులలో ఇదొక సాధారణమైన లాటిన్ నామమై యున్నది, "నీతిమంతుడైన వాడు" లేదా "న్యాయమైన వాడు" అని దీని అర్థమై

యున్నది.

"యూస్తు అని పిలువబడిన" – ఈ మాటలలో, ఈయన తనకున్న "యేసు" అను హెబ్రీ నామము కంటె తన లాటిన్ నామముతో అందరికీ సుపరిచితమైనవాడై యున్నాడను అంతర్భావమున్నది. రెండు పేర్లు, ఒకటి హెబ్రీ పేరు మరొకటి గ్రీకు పేరు పెట్టుకొనుట, యూదుల సంస్కృతిలో సర్వసాధారణమైన సంగతై యుండినది. ఇందుకు కొన్ని ఉదాహరణములేమనగా, "పేతురనబడిన సీమోను" (మత్తయి 4:18), "బర్నబా అని పిలువబడిన యోసేపు" (అపొస్తలుల కార్యములు 4:36), మరియు "మార్కు అను మారుపేరు గల యోహాను" (అపొస్తలుల కార్యములు 12:12).

### "వీరు సున్నతి పొందినవారిలో చేరినవారు, వీరు మాత్రమే దేవుని రాజ్యము నిమిత్తము నా జతపనివారై యున్నారు, వీరి వలన నాకు ఆదరణ కలిగెను" (4:11)

జతపనివారు (*sunergoi*) – ఈ పదము క్రైస్తవులకు మొత్తంపై అన్వయింపబడలేదు, కానీ సువార్త ప్రకటనలో పాటుపడువారి కష్టమునుబట్టి ఇతరుల నుండి ప్రత్యేకమైనవారై యుండినవారికి అన్వయింపబడినది (3 యోహాను 8వ వచనము చూడుము). దేవునితో (1 కొరింథీయులకు 3:9; 1 థెస్సలొనీకయులకు 3:2), "క్రీస్తు నందు" (రోమీయులకు 16:3, 9), పౌలుతో (రోమీయులకు 16:21; ఫిలిప్పీయులకు 2:25; 4:3; ఫిలేమోను 24), మరియు క్రైస్తవ సమాజము నిమిత్తము (2 కొరింథీయులకు 1:24; 8:23). జతపనివారై యుండినవారి విషయములో కూడ ఈ పదము వాడబడినది.

**దేవుని రాజ్యము** ఒక ప్రస్తుత వాస్తవమై యున్నదని పౌలు చెప్పాడు (1:13; రోమీయులకు 14:17; 2 థెస్సలొనీకయులకు 1:5 చూడుము). ఆయన ఎఫెస్సులోని ప్రజలను ఒప్పించుచు ఇతర ప్రదేశములలో, రోమా పట్టణమును కలుపుకొని, రెండు సంవత్సరముల వరకు సువార్తను బోధించుచుండగా, దేవుని రాజ్యమునకు సంబంధించి ఆయన ఉపదేశించుచుండెను. ఇతర సందర్భములలో "దేవుని రాజ్యము" ఈ జీవితము తరువాత ఒక ప్రదేశమై యున్నది.[3] పౌలు ఈ పదమును తన పదమూడు పత్రికలలో ఆరింటిలో చేర్చాడు (రోమీయులకు 14:17; 1 కొరింథీయులకు 6:9, 10; 15:50; గలతీయులకు 5:21; ఎఫెస్సీయులకు 5:5; కొలొస్సయులకు 4:11; 2 థెస్సలొనీకయులకు 1:5).

ఆయన పేర్కొనిన వారిలో మొదటి ముగ్గురు యూదులై ఉండిరని పౌలు సుస్పష్టముగా తెలియజెప్పలేదు; దానికి బదులుగా, వారు **సున్నతి పొందినవారిలో చేరినవారు** అని చెప్పాడు. సందర్భము మరొక విధంగా సూచిస్తే తప్ప, "యూదులు" అను పదము దాదాపుగా ఎల్లప్పుడు, క్రీస్తునంగీకరించి క్రైస్తవులు కాక, ధర్మశాస్త్రమును అనుసరించుచుండినవారిని సూచించినది (అపొస్తలుల కార్యములు 9:22, 23; 13:43, 45). మరొక ప్రక్క యూదీయ విశ్వాసమునకు సంబంధించినవాడై యుండి క్రైస్తవుడైనవాడు, ఈ పరిస్థితిలో సహితము మానవ జాతులకు సంబంధించినంత వరకు యూదుడుగానే పరిగణింపబడినాడు. యూదుడు పరదేశులతో సంబంధము కలిగియుండకూడదని తాను చేసిన ప్రకటలలో పేతురు తనను తాను కలుపుకొన్నాడు (అపొస్తలుల కార్యములు 10:28). అకుల, ఒక క్రైస్తవుడు, యూదుడని పిలువబడ్డాడు (అపొస్తలుల కార్యములు 18:2), కొందరు విశ్వాసులు యూదులైయుండిరని

యాకోబు ప్రస్తావించాడు (అపొస్తలుల కార్యములు 21:20, 21), పౌలు, ఆయన క్రైస్తవుడైన తరువాత కూడ, తనను తాను యూదుడని పిలుచుకొన్నాడు (అపొస్తలుల కార్యములు 21:39; 22:3).

పౌలుకు అరిస్తార్కు, మార్కు మరియు యూస్తు చేత ఆదరణ (parēgoria) సమకూర్చబడినది. ఈ పదము క్రొత్తనిబంధనలో ఇచ్చట మాత్రమే కనిపించుచున్నది. బైబిలేతర సాహిత్యములో, ఈ పదమునకు "సౌకర్యము" అను అర్థమున్నది. ఆయన క్రీస్తు యొక్క గొప్ప సేవకుడై యుండినప్పటికిని, పౌలుకు కూడ ఇతరుల వలెనే ఆదరణ అవసరమయ్యింది. పౌలు కొరింథులో ఉన్నప్పుడు ఆయనను ప్రోత్సాహించుటకు క్రీస్తు ఆయనకు ప్రత్యక్షమయ్యాడు (అపొస్తలుల కార్యములు 18:9, 10; 2 కొరింథీయులకు 1:3, 4 చూడుము). పౌలు అరుదుగా ఒంటరిగా ప్రయాణం చేసాడు లేక ఒంటరిగా ఉన్నాడు, కానీ ఇతరులు ఆయనతో కూడ ఉండవలెనని ఆశించాడు. ఆయన తన రెండవ మిషనరీ ప్రయాణంలో ఏథెన్సుకు చేరుకొన్నప్పుడు, సీల మరియు తిమోతి "సాధ్యమైనంత శీఘ్రముగా అతని యొద్దకు రావలెనని" వారిని పిలువనంపించాడు (అపొస్తలుల కార్యములు 17:15). ఆయన థెస్సలొనీకయుల గూర్చి కలిగియుండిన ఆందోళన మూలమున ఆయన ఏథెన్సులో ఒంటరిగా విడిచిపెట్టబడుటకు సంసిద్ధుడై ఇష్టపడుచుండెను (1 థెస్సలొనీకయులకు 3:1). అయితే ఆయనకు సాహచర్యము యుండదను అనుభూతి పొందుకొన్నాడు, గనుకనే ఆయన, "క్రీస్తు సువార్త ప్రకటించుటకు నేను త్రోయకు వచ్చినప్పుడు, ప్రభువునందు నాకు సమయము ప్రాప్తించి యుండగా సహోదరుడైన తీతు నాకు కనబడనందున నా మనస్సులో నెమ్మది లేక వారి యొద్ద సెలవు తీసికొని అక్కడ నుండి మాసిదోనియకు బయలుదేరితిని" అని వ్రాయుచున్నాడు (2 కొరింథీయులకు 2:12, 13).

### "మీలో ఒకడు ... ఎపఫ్రా" (4:12ఎ)

**ఎపఫ్రా**, "లూకా" మరియు "దేమా" (14వ వచనము చూడుము) ఇవి అన్యజనుల నామములై యున్నవి. ఆయన తన యూదీయ సహచరుల అభివందనములు వ్రాసిన తరువాత, పైన పేర్కొనబడిన పేర్లతో పౌలు తన అన్యజనులైన సహచరుల అభివందనములు వ్రాయుటకు మొదలుపెట్టాడు.

ఈ ఉత్తరము యొక్క పరిచయ వాక్కులలో అతని పేరును చేర్చుట ద్వారా ఎపఫ్రా ఆయన జతపనివాడని తెలియజెప్పుచు ఆయన ఎపఫ్రా పట్ల కలిగియుండిన ఉన్నతమైన గౌరవమును పౌలు వెల్లడిపరచాడు (1:7). అతని పూర్తి పేరు ఎపఫ్రొదితు. అయితే ఈయన పౌలు ఫిలిప్పీ పత్రిక వ్రాసినప్పుడు ఆయనతో కూడ నుండిన ఫిలిప్పీకి చెందిన అదే వ్యక్తి కాదు (ఫిలిప్పీయులకు 2:25; 4:18).

ఎపఫ్రా కొలొస్సయులకు సన్నిహితమైనవాడై ఉండియుండును. అలాగైతే పౌలు ఎపఫ్రాను తిమోతితో పాటు లేదా తిమోతికి బదులుగా ఎందుకు చేర్చలేదు? ఈ పత్రిక వ్రాయటానికి అతడు సహాయం చేసాడని పౌలు అతనిని పత్రిక యొక్క పరిచయములోనే ఎందుకు చేర్చలేదు? ఒక ఖైదీగా, అతడు పౌలు నుండి వేరుగా ఉంటూ పౌలును అరుదుగా కలిసికొని యుండవచ్చును. ఇంకా, అతడు పౌలుతో పాటు ఒత ఖైదీయై యుండినట్లయితే (ఫిలేమోను 23), అతడు ప్రయాణం చేయలేకపోవచ్చును, గనుక అతడు వెళ్లి ఆయన వ్రాసిన

పత్రికను అందజేయుటకు పౌలు అతనిని తుకికు మరియు ఒనేసిముతో కూడ ఎందుకు పంపలేదో ఇది వివరించుచున్నది.

కొలొస్సయి ఎపఫ్రా యొక్క స్వస్థలమై యుండునని లేదా అతడు అదే ప్రాంతము లేక కొలొస్సయిలోని సంఘమునకు చెందినవాడని **మీలో ఒకడును** అను మాటలు సూచించుచున్నది. బంధువులు, మిత్రులు, లేదా ఆ ప్రాంతము గూర్చి అతనికుండిన ఒక ప్రత్యేకమైన ఆసక్తిబట్టి, ఎపఫ్రా కొలొస్సయిలో మాత్రమే గాక లవొదికయ మరియు హియెరాపొలిలో కూడ పనిచేయుటకు ఎన్నుకొని యుండవచ్చును. పౌలు ఎఫెస్సులో ఉంటుండగా, అతడు ఆ ప్రాంతపువాడైనందునుబట్టి సువార్త ప్రకటన నిమిత్తము ఆయన ఎపఫ్రా కొలొస్సయికి పంపించియుండును. ఎపఫ్రా తన సొంత ప్రదేశము గూర్చి ఒక ప్రత్యేకమైన ఆసక్తి కలిగియుండుటలో ఆశ్చర్యము లేదు, అది స్వతస్సిద్ధమే.

### "క్రీస్తుయేసు దాసుడునైన ఎపఫ్రా మీకు వందనములు చెప్పుచున్నాడు ... యితడెల్లప్పుడును మీ కొరకు తన ప్రార్థనలలో పోరాడుచున్నాడు" (4:12ఎ)

**క్రీస్తు యేసు దాసుడు** అను పదమును పౌలు తన పత్రికలలో ఎపఫ్రా, తిమోతి, మరియు తనకు తానుగా మాత్రమే అన్వయించాడు (రోమీయులకు 1:1; గలతీయులకు 1:10; ఫిలిప్పీయులకు 1:1; తీతు 1:1). అతనిని ఈ విధముగా సన్మానించుట ద్వారా ఆయన ఎపఫ్రా యెడల కలిగియుండిన ఉన్నతమైన గౌరవమును పౌలు కనుపర్చాడు. ఎపఫ్రా గూర్చి, "తోటి దాసుడు" అని కూడ ప్రస్తావించుచు (1:7; 4:7) అతనిని తనతో కూడ యేసు దాసులలో ఒకనిగా పరిగణించుచున్నాడు. "దాసుడు" మరియు "బానిస" అను పదములు నీచమైనవిగాను నిందాజనకమైనవిగాను కనిపించును, కానీ పౌలు వాటిని ఈ భావముతో ప్రయోగించలేదు. యేసు క్రీస్తునకు దాసుడుగా లేక బానిసగా ఉండుట, అది సాధ్యమైనంత అత్యున్నతమైనదియు గౌరవప్రదమైనదైన స్థానమని ఎంచాడు.

అటుతరువాత, ఎపఫ్రా వారి కొరకు ఎల్లప్పుడును తన ప్రార్థనలలో పోరాడుచుండెనని పౌలు పలికాడు. "పోరాడుట" ("వేదన" అను పదము పుట్టిన, *agōnizomenos*), అనగా మనఃపూర్వకమైన ప్రయాసము యొక్క అత్యావశ్యకత అని అర్థము.[4] యేసు గెత్సేమనే తోటలో అనుభవించిన "వేదన"ను లూకా ఈ పదము యొక్క ఒక నామవాచక రూపముతో వర్ణించుచున్నాడు (లూకా 22:44), కొలొస్సయుల పక్షముగా ఆయన సలుపుచుండిన తన సొంత పోరాటము గూర్చి చెప్పినప్పుడు పౌలు కూడా ఇలాగే వర్ణించాడు (2:1). రోమాలోని విశ్వాసులు ప్రార్థనలయందు ఆయనతో కూడ పోరాడవలెనని వారిని అడిగినప్పుడు పౌలు ఒక క్రియా రూపమును ప్రయోగించాడు (రోమీయులకు 15:30). ఇచ్చట నున్న పదజాలము ఎపఫ్రా మనఃపూర్వకముగా, అయితే ఎడతెగక కూడ, ("ఎల్లప్పుడును") ప్రార్థించుటకు వ్యక్తము చేయుచున్నది.

### "మీరు సంపూర్ణులును, ప్రతి విషయములో దేవుని చిత్తమును గూర్చి సంపూర్ణాత్మ నిశ్చయతగలవారునై నిలుకడగా ఉండవలెనని" (4:12బి)

తన సహోదరులను నిలుకడగా ఉండవలెనని ఎపఫ్రా ప్రార్థించాడు. "(నిలువబడి) యుందుము" (*histēmi* నుండి *stathēte*), భౌతిక భావములో, ఒకే స్థానములో "నిలువబడి

యుండుట” అని అర్థము. ఆధ్యాత్మిక భావములో, గట్టిగా నిలిచియుండుట లేక ఒక ఒప్పింపును అంటిపెట్టుకొని మరియు హత్తుకొని యుండుట, కదలకుండ మెదలకుండా స్థిరముగా ఉండుట అని అర్థము. కొలొస్సయులు సుస్థిరమైన విశ్వాసులుగా నిలిచియుండవలెననియు, లౌకిక నియమములు లేక సాంప్రదాయములలోనికి కొట్టుకొనిపోకూడదనియు వారి కొరకు ఎపఫ్రా ప్రార్థించాడు.

“నిలువబడుము,” కర్మర్థక (నిశ్చేష్ట) క్రియగా ఉండుటనుబట్టి, కొలొస్సయిలోని క్రైస్తవులు నిలుకడగా నిలువబడునట్లు *ప్రేరేపింపబడవలెనని*, అది *సంభవింపబడవలెనని* ఎపఫ్రా ప్రార్థించాడని అది సూచించుచున్నది. అయితే, వారు నిలువబడునట్లు ఎలా చేయబడుదురో పౌలు వివరించలేదు. వారు నిలుకడగా నిలువబడి యుండుటకు అవసరమైన దైవికముగా మాత్రమే దయచేయబడు సహాయము కొరకు ఎపఫ్రా ప్రార్థించుచుండెనని కొందరు సూచించుచున్నారు. దైవిక సహాయము పరిశుద్ధాత్మ ద్వారా అనుగ్రహింపబడుతుంది (ఎఫెసీయులకు 3:16), కానీ అందు నిమిత్తము సహకరించు మానవ ప్రయత్నం లేకుండా అది అనుగ్రహింపబడదు, వారి వంతుకు వారు పడవలసిన ప్రయాసముతో అను ధ్వనింపుతో, ఎఫెస్సులోని క్రైస్తవులు నిలువబడవలెనని ఆజ్ఞాపింపబడి యుండిరి (ఎఫెసీయులకు 6:13, 14).

“నిలుకడగా” (*teleioi*), ఏ లోపమైనను లేని స్థితి కంటె, సంపూర్తిని మరియు పరిపక్వతను ఎక్కువగా తెలియజెప్పుచున్నది. NASBలో గ్రీకు పదము “పరిపూర్ణముగా” అని పన్నెండు పర్యాయములు అనువదింపబడినది, వాటిలో ఏడింటిని “పరిపక్వమైన” లేక “పూర్తిగా ఎదిగిన” అని అనువదింవచ్చును, ఏలయనగా క్రైస్తవ గుణగణములను అభివృద్ధి చేసుకొను సందర్భములో అవి కనిపించుచున్నవి (మత్తయి 5:48; ఫిలిప్పీయులకు 3:15; 3:12; యాకోబు 1:4; 3:2; 1 యోహాను 4:18). వాక్యములో లేక దేవుని చిత్తములో కనబడుచున్నదియు దాని చేతనే సమకూర్చబడినదైన సంపూర్తి సందర్భములో నాలుగుసార్లు పేర్కొనబడి యున్నది (రోమీయులకు 12:2; 1 కొరింథీయులకు 13:10; యాకోబు 1:17, 25), మరియు ఒకటి సంపూర్తి పరలోక గుడారమును సూచించుచున్నది (హెబ్రీయులకు 9:11). *Teleios* అను పదము యొక్క రూపములను “పరిపూర్ణము” (1 కొరింథీయులకు 2:6; 14:20; ఎఫెసీయులకు 4:13; హెబ్రీయులకు 5:14) అనియు, లేక “సంపూర్ణము” (మత్తయి 19:21; కొలొస్సయులకు 1:28) అనియు NASB దాని ఇతర వాక్యభాగములలో అనువదించుచున్నది.

పాపములేనివాడు ఒక్కడైనను లేడు (రోమీయులకు 3:9, 10, 23). దేవత్వము మాత్రమే సంపూర్ణ పాపరహితత్వమును సూచించు సందర్భములో పరిపూర్ణమును ఏ లోపమైనను లేకుండా ఉన్నాడు (మత్తయి 19:17). క్రైస్తవులు అధికతరమగుచుండు పరిమాణములో కలిగియుండవలసిన లక్షణములను పైన ఇవ్వబడిన వాక్యభాగములు వర్ణించుచున్నవి. ఈ హేతువునుబట్టియే, *teleios* అను పదము “పరిపూర్ణమైన” అని అనువదింపబడకూడదు కానీ దానికి బదులుగా “పరిపక్వమైన” లేదా “ఎదిగిన” అని అనుదింపబడవలెను. కొలొస్సీలోని క్రైస్తవ సమాజములో పరిపక్వత కలుగవలెనను ఎపఫ్రా ప్రార్థనలు ప్రయోజనకరమైనవిగా ఉండును, అయితే ఏ లోపమైనను లేని పరిపూర్ణత కొరకు చేయబడు ప్రార్థనలు నిష్ఫలమే. ఏలయనగా ఈ జీవితములో పొరపాటుపడజాలని పాపరాహిత్యము ఎవరిచేతనైనను

సంతరించుకొనబడజాలదు (1 యోహాను 1:8, 10). యేసు ఒక్కడు మాత్రమే పాపములేకుండా జీవించాడు (2 కొరింథీయులకు 5:21; హెబ్రీయులకు 4:15; 7:26).

ఇంకా, కొలొస్సయులు ప్రతి విషయములో దేవుని చిత్తమును గూర్చి సంపూర్ణాత్మ నిశ్చయతగలవారునై (plērophreō) యుండవలెనని ఎపఫ్రా వారి కొరకు ప్రార్థించాడు. ఒక చర్య సంపూర్ణముగా చేయబడినదని సూచించు ఈ క్రియాపదము గతములో చేయబడి కొనసాగుచున్న ఫలితముగల ఒక కార్యమును వ్యక్తము చేయుచున్నది. వారు సందేశములోని సత్యము గూర్చి ఒప్పింపబడ్డారని ఎరిగినవాడై, వారు యింకా సంపూర్ణముగా ఒప్పింపబడినవారివలెనే ఎల్లప్పుడు నిలిచియుండవలెనని ఎపఫ్రా ఆశించాడు.

**ప్రతి విషయములో దేవుని చిత్తమును గూర్చి** అని చెప్పుట ద్వారా, దేవుడు కోరుచున్న ఏ విషయమునైనను విడిచిపెట్టకుండా అని పౌలు భావించాడు. ఒకవేళ కొలొస్సయులు దేవుని చిత్తమునకు ఏదేని కలుపగలిగినట్లయితే లేదా దాని నుండి దేనినైనను తీసివేయగలిగినట్లయితే, వారు ఆయన "చిత్తమంతటిని" చేయుచున్నవారు కారు. ఆయన వారికి ఆజ్ఞాపించిన సమస్తమును గైకొనునట్లు బాప్తిస్మము పొందినవారికి వారు నేర్పించవలెనని యేసు తన అపొస్తలులకు ఆజ్ఞాపించాడు (మత్తయి 28:19, 20). ఒకడు దేవుడు బయలుపరిచిన దానికి దేనినైనను చేర్చక లేదా దేనినైనను తీసివేయనట్లయితేనే వాడు దేవుని "చిత్తమంతటిని" నెరవేర్చగలడు.

### "ఇతడు మీ కొరకును, లవొదికయవారి కొరకును, హియెరాపొలివారి కొరకును, బహు ప్రయాసపడుచున్నాడని యితని గూర్చి సాక్ష్యమిచ్చుచున్నాను" (4:13)

రెండు పట్టణములు, **లవొదికయ మరియు హియెరాపొలి**, లైకస్ లోయ అని పిలువబడిన ఆ ప్రదేశములో ఎదురెదురుగా, సుమారు ఆరు మైళ్ల ఎడములో ఉండినవి. ఎపఫ్రా పౌలుకు ఒక సన్నిహితమైన స్నేహితుడుగా ఉంటూ ఈ సహోదరుల కొరకు పౌలుతో కూడ తరచుగా ప్రార్థించినందును బట్టి, ఈ పట్టణములలోని క్రైస్తవుల విశ్వాసబలము గూర్చిన భారము అతని హృదయములో బహుగా ఉండినదని పౌలు ఎరిగి యుండెను. వారు ప్రభువైన యేసుక్రీస్తు నందలి విశ్వాసములో సుస్థిరులై యుంటూ ఆయనకే అంకితమైనవారై యుండవలెనని కోరుచు, అతడు వారి పక్షముగా ఎడతెగక ప్రార్థించుచుండెను.

### "లూకా అను ప్రియుడైన వైద్యుడును, దేమాయు మీకు వందనములు చెప్పుచున్నారు" (4:14)

**లూకా** – లాటిన్ పేరు "లూసియస్"కు, ఒక మారు పేరు. పౌలు లూకాను అతిగా ప్రేమించాడని **ప్రియుడైన వైద్యుడు** అను అభివ్యక్తము చూపించుచున్నది. "ప్రియుడైన" – ఆయన ఇతర సహచరుల యెడల కలిగియుండిన అనురాగమును వర్ణించుటకు పౌలు ఎన్నుకొనిన ప్రీతిని పుట్టించు ఒక పదమై యున్నది.[6] ఇది ఇతరులందరు పౌలును విడిచిపెట్టి వెళ్లిపోయిన తరువాత లూకా పౌలు యెడల కలిగియుండిన రాచభక్తికి నిదర్శనముగా నిలిచిన ఒక అన్యోన్యమైన అనురాగమై యుండినది (2 తిమోతి 4:11).

అపొస్తలుల కార్యములు 27:28 ప్రకారము, లూకా పౌలుతో కూడ రోమా పట్టణం వరకు నౌకాయానం చేసాడు. అక్కడ పౌలు చెరసాలలో ఉన్నప్పుడు ఆయనతో కూడ ఉన్నాడు. రెండవ

మరియు మూడవ సువార్తల గ్రంథకర్తలను, మార్కు మరియు లూకా, ఒకే సమయంలో పౌలు రెండవసారి చెరసాలలో ఉంచబడినప్పుడు, ఆయనతో కూడ కలిసి యుండుటను కనుగొనుట, ఒక ఆసక్తికరమైన అంశముగానే యున్నది. వారు సమాచారమును ఒకరితోనొకరు పంచుకొన్నారా? లేక వారి సువార్త నివేదికలను అదివరకే రచించారా? మనకు తెలియదు.

ఇతరమైన రెండు చెరసాల పత్రికలలో, ఆయన తనతో కూడ ఉండిన సహచరులలో ఒకడని, పౌలు లూకా సువార్త మరియు అపొస్తలుల కార్యముల గ్రంథకర్తయైన లూకా గూర్చి తెలియజెప్పాడు (2 తిమోతి 4:11; ఫిలేమోను 24). ఈ పుస్తకములలో లూకా పేరు కనబడక పోయినప్పటికిని, పౌలు వ్రాసిన ఉత్తరములను అపొస్తలుల కార్యముల గ్రంథంతో పోల్చుచూ చేపట్టబడు తొలగింపు ప్రక్రియ ప్రకారము, రచయిత “మేము” మరియు “మాకు” అని వ్రాసినప్పుడు పౌలుతో కూడ లూకా మరియు తీతు మాత్రమే ఉండియుండవచ్చునని తెలియును.[7] రెండు గ్రంథములను కూడ లూకాయే రచించాడని చెప్పుటకు గల ఇతర నిదర్శనములో, ఆయన గొప్ప విద్యావంతుడై యుండెనని చూపించు భాషాశైలి, మరియు డయోగ్నెటు, ఐరేనియస్, అలెగ్జాండ్రియాకు చెందిన క్లెమెంతు, తెర్తుల్లు, మరియు యూసిబియస్ వంటి తొలి రచయితల సాక్ష్యము కలిసియున్నవి.

పౌలు లూకాను “ప్రియుడైన వైద్యుడు” అని సంబోధించుటయేగాక (4:14), తన “తోటి పనివారిలో” లూకా ఒకడై యుండెననుటకు (ఫిలేమోను 24) లూకా పేరును మార్కు, అరిస్తార్కు, మరియు దేమా పేర్లతో కూడ చేర్చాడు. అపొస్తలుల కార్యముల గ్రంథంలో ఆయన ఒక వైద్యుడని తనను తాను చిత్రీకరించుకొనుటకు బదులుగా, సువార్త వ్యాపకములో ఆయన పౌలుతోను ఇతరులతోను కలిసి పాటుపడ్డాడని లూకా ప్రస్తావించాడు. “సువార్త ప్రకటించుటకు దేవుడు మమ్మును పిలిచియున్నాడు” అని లూకా రచించాడు (అపొస్తలుల కార్యములు 16:10).

పౌలు తన రెండవ మిషనరీ ప్రయాణ సమయంలో త్రోయలో ఉన్నప్పుడు పౌలుతో సంబంధము పెంచుకొనుటకు లూకా మొదలుపెట్టాడని అపొస్తలుల కార్యములు గ్రంథంలో “మేము” అని తెలియజేయు వాక్యభాగములు బయలుపరచుచున్నవి, ఆయన త్రోయలో పౌలుతో చేరిపోవునప్పటికే క్రీస్తునంగీకరించినవాడై యుండుట అధికంగా సంభావ్యమై యున్నది, ఏలయనగా సువార్తను ప్రకటించుటకు వారు మాసిదోనియకు వెళ్లవలసినదని వచ్చిన పిలుపులో ఆయన తనను తాను కూడ కలుపుకొన్నాడు (అపొస్తలుల కార్యములు 16:10). ఆయనకు వైద్య సహాయము అవసరమై యుండినందునుబట్టి పౌలే లూకాను సంప్రదించాడని కొందరు భావించుదురు. పౌలు లూకాతో కలిగియుండిన సన్నిహిత సంబంధము ద్వారా అతనిని ప్రభువు నొద్దకు నడిపించిన తరువాత, పౌలుకు అవసరమై యుండిన వైద్య సహాయమును సమయానుసారంగా అందించగలుగునట్లు ఆయన పౌలుతో కూడ ఆయన వ్యక్తిగత వైద్యుడుగా పయనించాడు. ఇదొక ఊహ మాత్రమే, కచ్చితంగా అంగీకరింపబడజాలదు.

పౌలు మరియు ఆయనతో కూడ నుండిన ఇతర సహచరులతో పాటు, లూకా కూడ పయనించి త్రోయ నుండి ఫిలిప్పీకు వెళ్లాడు. అక్కడ, వ్యాపార లావాదేవీలు జరుగుచుండినచోట, ఆయన ఒక చిన్నదానిని (బానిస పిల్లను) ఎదుర్కొన్నాడు, “ఈ మనుష్యులు సర్వోన్నతుడైన దేవుని దాసులు, వీరు మీకు రక్షణ మార్గము ప్రచురించువారై

యున్నారు” అని కేకలువేయుచు, ఆ చిన్నది ఆయనను (ఆయనతో కూడ పౌలు, సీల, మరియు తిమోతిని) వెంబడించుచుండినది (అపొస్తలుల కార్యములు 16:17). లూకా మరియు ఇతరులు యేసు నామములో లభించు రక్షణను బోధించుచుండిరను ధ్వనింపును ఆ చిన్నది చూపించిన ప్రతిస్పందన స్పష్టముగా తెలియజెప్పుచున్నది. పౌలు, సీల, మరియు తిమోతి వెళ్లిపోయినప్పుడు, పౌలు తన మూడవ మిషనరీ ప్రయాణంపై తిరిగి వచ్చినంత వరకు అచ్చటనే ఫిలిప్పీలో ఉండిపోయాడు (అపొస్తలుల కార్యములు 16:10-17; 20:5-15). అక్కడ నుండి, ఆయన పౌలుతో కూడ యెరూషలేమునకు వెళ్లిపోయాడు (అపొస్తలుల కార్యములు 21:1-18), అటుతరూత, రోమాకు వెళ్లి పౌలుతో కూడ రెండు సంవత్సరములు గడిపాడు (అపొస్తలుల కార్యములు 27:1-28:16).

అతడు కూడ పౌలుతో సహచరులుగా ఉండినవారి జాబితాలో అతనిని చేర్చలేదను వాస్తవం ఆధారంగా, తీతు లూకా సహోదరుడై యుండెనని కొందరు అనుకొనుచున్నారు. పౌలుతో కూడ తన మూడవ మిషనరీ ప్రయాణంలో తీతు ఉండెనని పౌలు వ్రాసిన పత్రికల ద్వారా విశదమగుచున్నది (2 కొరింథీయులకు 2:13; 7:6; గలతీయులకు 2:1-3 చూడుము). ఇదే నిజమైతే, లూకా తన సహోదరుని పేరు గాని, తీతు పేరు గాని, సరికదా తన సొంత పేరును సహితము అపొస్తలుల కార్యముల గ్రంథంలో వ్రాయలేదను విషయమును లూకా యొక్క నమ్రతకు ఆరోపించవచ్చును.

లూకా పేరు అన్యజనుల పేర్ల జాబితాలో చేర్చబడుట లూకా ఒక అన్యుడై యుండెనని బహుశా సూచించవచ్చును. రోమీయులకు 16:21లో అతనిని తన సమీపబంధువని సంబోధించియుండనట్లయితే అసలే తెలియకుండాపోవుటకు అవకాశముండిన లూకియతో ఓరిగెన్ అతనిని గుర్తించాడు. ఇతడు సిరియా దేశంలోని అంతియొకయలో జన్మించాడని యూసిబియస్ మరియు జెరోమ్ వారి తుది అభిప్రాయమును తెలియజేసారు.[8] అలాగైతే, కొందరు చెప్పినట్లుగా, అతడు అపొస్తలుల కార్యములు 13:1లోని, కురేనీయుడైన లూకియ అయియుండును. వైద్యుడైన లూకాకును ఈ ఇరువురికిని ఎటువంటి కచ్చితమైన సంబంధము లేదు. ఈయన లూకా సువార్త మరియు అపొస్తలుల కార్యములు గ్రంథం రచింపబడిన ధనవంతుడైన ప్రభుత్వ అధికారియై యుండుటకు సాధ్యమగు థెయొపిల ఇంటిలో ఉపచారము చేసాడనునది మరొక ప్రతిపాదనయై యున్నది (లూకా 1:3; అపొస్తలుల కార్యములు 1:1). సాంప్రదాయము ప్రకారము, పౌలు మరణించిన తరువాత, లూకా దల్మనూతా, గౌల్, ఇటలీ, మరియు మాసిదోనియలో ఒక ప్రబోధకుడై యుండెను; ఆయన మొదటి శతాబ్దము ముగియుచుండిన రోజుల్లో అకయ లేక బితునియలో మరణించి యుండును.[9]

**దేమా** పేరు కొలొస్సీ మరియు ఫిలేమోను పత్రికలలో లూకా పేరుతో కూడ కనిపించుచున్నది. ఈ జతపనివారి గూర్చి పౌలు చివరిసారి వ్రాసేనాటికి, లూకా పౌలుతో కూడ ఉన్నాడు - పౌలు చెరసాలలో ఉన్నాడు, - దేమా థెస్సలొనీకకు వెళ్లిపోయాడని (2 తిమోతి 4:10, 11). “దేమా,” “దేమేత్రి”కి లఘురూపమై యున్నది, మరియు 3 యోహాను 12వ వచనంలో పేర్కొనబడిన దేమేత్రి ఇతడే అని కొందరనుకొనుటకు ఇది హేతువయ్యింది. ఇతరులకిచ్చిన సిఫారసు లేకుండానే ఈయనను పౌలు పేర్కొనుచున్నాడంటే, ఈయన కొలొస్సయులకు పరిచయస్తుడే యను భావము కలుగుచున్నది. మరొక ప్రక్క, ఇతని గూర్చి పౌలు ఏమియు చెప్పలేదు, ఏలయనగా అత్యధికంగా ప్రశంసించుటకు ఈయనలో

పౌలు ఏ ప్రత్యేకతనైనను కనుగొనియుండక పోవచ్చును. ఈ లోకాశాలకు లొంగిపోయినవారై ఆయనను విడిచిపెట్టి థెస్సలొనీకకు వెళ్లిపోయినవారిలో ఈయన ఒకడని పౌలు ఈయన గూర్చి తిమోతికి వ్రాయబడిన రెండవ పత్రికలో చెప్పుచున్నాడు (2 తిమోతి 4:10). బహుశా, పౌలు అతనిలో ఉండిన అస్థిరత్వమును గుర్తించియుండును, అది అటుతరువాత బయట పడినది.

## సహోదరులకు అభివందనములు మరియు విశేష వ్యాఖ్యానములు (4:15–17)

**[15-17]లవొదికయలో ఉన్న సహోదరులకును, నుంఫాకును, వారి యింట ఉన్న సంఘమునకును వందనములు చెప్పుడి. ఈ పత్రిక మీరు చదివించుకొనిన తరువాత లవొదికయ వారి సంఘములోను చదివించుడి; మరియు – ప్రభువునందు నీకు అప్పగింపబడిన పరిచర్యను నెరవేర్చుటకు దాని గూర్చి జాగ్రత్తపడుమని అర్ఖిప్పుతో చెప్పుడి.**

**"లవొదికయలో ఉన్న సహోదరులకు ... వందనములు చెప్పుడి" (4:15)**

లవొదికయలోని వారికి అభివందనములు తెలియజేయుట మరియు వారితో పౌలు పంపిన పత్రికను పంచుకొనుట వలన కొలొస్సయులకు ఎటువంటి కష్టము కలుగదు ఏలయనగా వారి రెండు పట్టణములు కూడ సుమారు ఇది మైళ్ల ఎడములో ఉండెను. పౌలు **లవొదికయలో** అనేకులను ఎరిగియుండనప్పటికిని, ఆయన సంఘములోని కొందరు సభ్యులను ఎరిగియుండెను. ఆయనకు అతని పేరుతో సహా నుంఫా తెలియును, పౌలు ఎఫెస్సు పట్టణంలో సుమారుగా మూడు సంవత్సరములు బసచేయుచుండినప్పుడు లవొదికయలోని కొందరు ఆయనను సందర్శించియుందురు (అపొస్తలుల కార్యములు 20:31).

సహోదరులు (*adelphoi*), పులింగమును సూచించు పదమైయున్నప్పటికిని, ఈ సందర్భములో ఇది స్త్రీలకును పురుషులకును వర్తించుచున్నది. పౌలు, సహోదరులు మరియు స్త్రీ లింగమును సూచించు *adelphai* అను పదమును చేర్చుచు, "సహోదరీమణులు" అని వ్రాసియుండవచ్చును. ఏదిఏమైనా adelphoi ఇచ్చట మాత్రమే కనిపించుచున్నందు వలన, పౌలు "సహోదరులు" అను పదమును ఒక జాతి వాచక నామధేయ భావముతో ప్రయోగించాడనియు, అందులో వారిని సహితము చేర్చాడనియు సహోదరీమణులు కచ్చితంగా భావించియుందురు.

ఒక సంఘము మరొక సంఘమునకు వారి **అభివందనములు తెలియజేసికొనవలనని** ఆదేశింపబడిన సందర్భము క్రొత్త నిబంధనలో ఇదొక్కటే. అయితే అభివందనములను వారు ఎలా తెలియజేసికొనవలెనో, ఒక ఉత్తరము ద్వారానా లేక ఒక వార్తాహరుడు వ్యక్తిగతముగా సందర్శించుట ద్వారానా, ఒకరినొకరు వ్యక్తిగతముగానా లేక బహిరంగ కూడికలోనా, మొ॥ వివరముల గూర్చి పౌలు ఆదేశములివ్వలేదు. వాస్తవానికి ఈ అభివందనములు ఎవరు తెలియజేయాలో కూడ చెప్పలేదు: ఉత్తరమును చదువుచుండినవాడా, సంఘములోని ఒక నాయకుడా, లేక ఎవరో ఒకరు ఇతరులా, అనునది స్పష్టంగా లేదు. కొలొస్సయులు **లవొదికయలో** నున్న వారికి అభివందనములు తెలుపవలెనని పౌలు చెప్పుచుండెను,

అంతేగాని ఆయన కొలొస్సయులకు వ్రాసిన ఉత్తరమును వారు చదువవలసిన అవసరంలేదు. లవొదికయలో నున్న సహోదరులకు కొలొస్సయులు అభివందనములు తెలియజేయవలెనని పౌలు కొలొస్సయులను అడుగుట, ఈ రెండు సంఘముల నడుమ మరియు బహుశా ఇతర సంఘములకు సంబంధించిన విశ్వాసుల నడుమ అన్యోన్య సహవాస సంబంధముండినదని సూచించుచున్నది. ఈ రెండు సంఘములు మాత్రం ఒకరితో నొకరు సన్నిహిత సహవాస సంబంధము కలిగియుండుటకు సరిపడునంత సమీపములో ఉండినవి.

### "... నుంఫాకును, వారి యింట ఉన్న సంఘమునకును వందనములు చెప్పుడి" (4:15)

సంఘము (*ekklēsia*) అను పదమునకు నానా విధ నిర్వచనములుండును, అయితే ఇచ్చట స్థానిక సంఘమని అర్థము. గనుక విశాల దృష్టికోణంలో క్రీస్తు శరీరము కాదు.

సంఘములు తరచుగా వ్యక్తిగత గృహములలో కూడుకొనుచుండినవి (అపొస్తలుల కార్యములు 12:12), ముఖ్యంగా సంపన్నులైన సభ్యుల గృహములలో, అచ్చట ఇటువంటి కూడికలకు విశాల గదులుండును. మొదటి రెండు శతాబ్దముల వరకు కూడ, ఇది మామూలుగా క్రైస్తవులు కూడుకొను స్థలమై యుండినది. ఇతర క్రైస్తవుల గృహములలో కూడుకొనుచుండిన సంఘములను సహితము పౌలు ప్రస్తావించాడు (రోమీయులకు 16:5, 23; 1 కొరింథీయులకు 16:19; ఫిలేమోను 2).

నుంఫా ("నింఫా" అనునది కూడ సాధ్యమే) అను పేరు యొక్క లింగము, వాక్యములోని ద్వితీయా విభక్తి రూపము చేత నిర్ధారింపబడజాలదు. ఈ సందర్భములోని సర్వనామము, భావింపబడిన లింగమును నిర్ధారించును. ఉత్తమమైన చేతివ్రాత ప్రతులు "అతని గృహము" నకు బదులుగా ఆమె గృహము అని వాటి అనుకూల భావమును తెలియజెప్పుచున్నప్పటికిని, అనువాదములు వెవ్వేరుగా ఉన్నవి. NIV, TNIV, 1977 NASB, మరియు NASB "ఆమె" అని చెప్పుచున్నవి; కానీ NASBలో అధఃస్సూచికలో వ్రాయబడియున్నది: "లేదా నింఫా (పుల్లింగము)" KJV మరియు NKJVలో అనువదింపబడినది. ASVలో "వారి" అని అనువదింపబడినది. "అతని గృహము" అని చేయబడిన మార్పు, తరువాత తరములవారు ఇంటి సొంతదారు ఒక స్త్రీ అని ప్రస్తావింపబడుటను ప్రశ్నించినందునుబట్టి చేయబడినదని కొందరు వ్యాఖ్యానకర్తలు ఊహించుకొన్నారు; ఏదిఏమైనా, ఇదొక న్యాయసమ్మతమైన వివరణ కాకపోవచ్చును. మరియు, మార్కు అను మారుపేరు గల యోహాను తల్లికి, యెరూషలేములో ఒక ఇల్లుండినది (అపొస్తలుల కార్యములు 12:12), మరియు పౌలు మరియు ఆయనతో కూడ నుండిన సహచరులు "నా యింటికి వచ్చియుండిరి" అని లూదియ పట్టుబట్టుచున్నది (అపొస్తలుల కార్యములు 16:15), స్త్రీలు సహితము ఇళ్లకు సొంతదారులైయుండిరని ఇది సూచించుచున్నది. నుంఫా అనునది పుల్లింగ నామము నుంఫాడొర్‌కు ఒక కుదింపైయున్నదనియు గనుక ఆ గృహము ఒక పురుషునికి చెందినదని కూడ సూచింపబడినది. ఏదిఏమైనా, చేతివ్రాతప్రతుల నిదర్శనము యొక్క ఉద్ఘాటన, "ఆమె గృహము" అనునదే సరైన అన్వయమని చూపించుచున్నది.

పౌలు నుంఫాను వ్యక్తిగతంగా ఎరిగియుండును. కనీసము నుంఫా పేరు పేర్కొనబడిన వాస్తవము ఆయన ఆమెను కలిసికొనియుండవచ్చును లేదా ఎవరైనా ఒకరి ద్వారా, బహుశా

ఎపఫ్రా ద్వారా, ఆమె గూర్చిన సమాచారమును అందుకొని యుండునను భావమును కలుగజేయుచున్నది. పౌలు ఒక స్త్రీ పేరును పేర్కొనుట అసాధారణమైన విషయమేమీ కాదు, ఏలయనగా ఆయన ఇతర పత్రికలలో కూడ స్త్రీల పేర్లు పేర్కొన్నాడు (రోమీయులకు 16:3, 6; 1 కొరింథీయులకు 16:19; ఫిలిప్పీయులకు 4:2, 3).

నుంఫా నివసించుచుండిన నగరము ఏదో కచ్చితంగా నిర్ధారింపబడజాలదు. పౌలు లవొదికయ సంఘమునకు పంపిన అభివందనముల వెనువెంటనే ఆమె పేరు పేర్కొనబడినది గనుక, ఇది ఆమె స్వస్థలములోని సంఘమని కొందరు అనుకొనుచున్నారు. ఆమె నివసించిన స్థలమును పత్రిక గ్రహీతలు ఎరిగి యుందురు.

**"ఈ పత్రిక మీరు చదివించుకొనిన తరువాత లవొదికయ వారి సంఘములోను చదివించుడి" (4:16ఎ)**

చదువుట (*anaginōskō*) చదువుకొనుటకు సంబంధించిన సర్వసాధారణ పదము నుండి వచ్చినది. బహిరంగముగా చదువుటను సూచించు పదము *anaginōsis*, క్రొత్త నిబంధనలో మూడు పర్యాయములు మాత్రమే కనిపించుచున్నది (అపొస్తలుల కార్యములు 13:15; 2 కొరింథీయులకు 3:14; 1 తిమోతి 4:13). పౌలు పత్రికలు పలు సంఘములలో చూపింపబడి చదువుకొనబడుటకే వ్రాయబడినవి, గనుక అవి నేడు సహితము అధ్యయనము చేయబడుచు గౌరవింపబడవలెను. మీరు (మీ మధ్య) అని పౌలు వ్రాసాడంటే, ఆయన వ్రాసి పంపిన పత్రికలు చదువబడుచుండగా వినుటకు సంఘములోని సభ్యులందరికిని అవకాశము యియ్యవలెనని స్పష్టము చేయుచున్నది (1 థెస్సలొనీకయులకు 5:27 చూడుము).

పౌలు మనస్సులో కొలొస్సయి సంఘము మాత్రమే గాక, దానికి ఆవల నుండిన ప్రేక్షకులు కూడ ఉన్నారని తెలియుచున్నది, ఏలయనగా ఆయన పంపిన పత్రిక లవొదికయలోను చదివింపబడవలెనని ఆయన విన్నవించుకొనుచున్నాడు. అలాగే లవొదికయ నుండి వచ్చిన ఉత్తరము కొలొస్సీలో చదివింపబడవలెనని కూడా ఆయన ఆశించాడు, అనగా ఈ రెండు సంఘములు దాదాపుగా ఒకే విధమైన సమస్యలను ఎదుర్కొనుచుండెనని అర్థమగుచున్నది. సంఘముగా వారందరు కూడుకొనినప్పుడు వారిలో నుండి ఈ ఉత్తరమును ఎవరు చదివి వినిపించాలో ఆయన నిర్దిష్టముగా చెప్పలేదు. తేటగా, పౌలు పత్రికను ఎవరు చదివి వినిపించాలో, ఎలా చదువాలో, అది కొలొస్సయిలోని సంఘమువారి సొంత విచక్షణకు వదిలిపెట్టినది. ఏదైన ఒక పని చేయబడవలెనని లేఖనములలో కొన్ని పర్యాయములు ఆదేశములివ్వబడినవి; కానీ అవి ఎలా, ఎప్పుడు, మరియు ఎక్కడ చేయబడవలెనో యను విషయము ఆయా ఆదేశములను అమలు చేయువారి విచక్షణకు వదిలిపెట్టబడినదను వాస్తవమునకు ఇదొక చక్కని ఉదాహరణ చిత్రీకరణయై యున్నది.

సంఘము క్రమముగా కూడుకొనుచుండిన ఒక సమయంలో పౌలు పత్రిక చదివి వినిపింపబడినదని మనము ఊహించుకొనవచ్చును, మరియు ఇది కచ్చితంగా వారములోని మొదటి రోజున జరిగియుండును. ఈ రోజు వారి కూడికల ప్రత్యేక దినమై యుండినది (అపొస్తలుల కార్యములు 20:7; 1 కొరింథీయులకు 16:2), అది ప్రభువు దినము (*hē kuriakē hēmera*; ప్రకటన 1:10) అని సంబోధింపబడినది. వారి ఆదివారపు కూడికలను సూచించుటకు ఈ పదజాలము ఆది సంఘము చేత ప్రయోగింపబడినది.

**“లవొదికయకు వ్రాసి పంపిన పత్రిక మీరును చదివించుకొనుడి” (4:16బి)**

**లవొదికయకు వ్రాసి పంపిన పత్రిక** అను సూచన సంశయాత్మక ప్రశ్నలను లేవదీయుచున్నది, వాటికి సమాధానమిచ్చుట అంత సులభం కాదు. అందుకు నానా విధ సాధ్యతలు సూచింపబడినవి:

(1) ఇది పౌలు లవొదికయకు వ్రాసిన ఉత్తరములలో పోగొట్టుకొనబడిన ఒక ఉత్తరము గూర్చిన ప్రస్తావనయై యున్నదని కొందరనుకొనుచున్నారు. దీనిని ఆధారంచేసుకొని, సామాన్యమైనవి మరియు ప్రశస్తమైనవి అనేక విషయాలు పరిశుద్ధ సత్యవేదములో లేకుండాపోయాయని మార్మొనులు తర్కించుదురు. అది లవొదికయ సంఘమునకు వ్రాయబడిన ఉత్తరమని తాపత్రయంపడుటకు సంభావ్యముకాని ఉత్తరము దాదాపు నాలుగవ శతాబ్దములో కనిపించినది:

> జెరోమ్[10] ... మరియు కొందరు గ్రీకు పితామహులు దొంగతనముగా కల్పింపబడిన ఒక లవొదికయ పత్రిక గూర్చి అనాదరముగా చెప్పుదురు, కానీ నైసీయా రెండవ మహాసభ (క్రీ.శ. 787) దానిని త్రోసిపుచ్చినది. ఏదిఏమైనా, ఆరవ శతాబ్దములో పరిశుద్ధ బైబిలు యొక్క లాటిన్ వల్గేట్‌తో (కోడెక్స్ ఫుల్‌డెన్సిస్) మొదలై, మధ్య యుగము ఆటి వరకు కొనసాగినవి, అనేక లాటిన్ చేతివ్రాతప్రతులు, లవొదికయ సంఘమునకు వ్రాయబడిన ఒక పత్రిక కలిగియున్నవి: ఇది పౌలుకు సంబంధించిన పదజాలముల నిస్త్రాణమైన మరియు నిరాకారమైన ఒకకూర్పై యున్నది, ముఖ్యంగా ఫిలిప్పీ పత్రిక నుండి గ్రంథచర్యము చేయబడినది, కానీ దాని వెనుక కొలొస్సయులకు 4:16ను పూరించుటకు మించినది స్పష్టమైన ప్రోత్సాహకమేదియును లేదు. అది గ్రీకు నుండి అనువదింపబడిన గుర్తులు కలిగియున్నది: అరబీ భాషలో నున్న ఒక అనువాదము కూడ ఈ విషయమును సూచించుచున్నది. అది నాలుగవ శతాబ్దమునకు తరువాతదై యుండజాలదు, కానీ అది మురటోరియన్ కేనన్‌లో (గ్రీకులో వ్రాయబడిన ప్రాచీన ప్రామాణిక గ్రంథముల జాబితాలో) ఆక్షేపింపబడి దాడిచేయబడిన రెండవ శతాబ్దము నాటి పత్రియై యుండుట అసంభావ్యము.[11]

(2) అది పౌలు ఏదో ఒక తెలియని సంఘమునకు వ్రాసిన ఉత్తరమై యున్నదనునది మరొక అభిప్రాయము. కానీ ఈ దృక్పథమును అంగీకరించువారు కొందరే. మరొకసారి, ఇటువంటి ఉత్తరమేదైనా ఉండియున్నట్లయితే, అది పోగొట్టుకొనబడినది.

(3) పౌలు కొలొస్సయులకు వ్రాయుచుండినను అదే పత్రికలో లవొదికయ సంఘమునకు అభివందనములు ఎందుకు పంపించాడో వివరించగలుగునట్లు, లవొదికయ సంఘమునకు ఉత్తరమును ఎపఫ్రా వ్రాసాడని సూచింపబడినది. ఈ ప్రకారంగా పౌలు దీనిని వ్రాయనట్లయితే, వారికి తన అభివందనములు పంపించుట ఎపఫ్రాకు యిది తొలి సందర్భమై యుండును. ఈ వివరణ లవొదికయ సంఘమునకు వ్రాయబడిన ఉత్తరమును పౌలు “నా ఉత్తరము” అని సూచించాడను విషయమును లెక్కలోనికి తీసికొనలేదని కనిపించుచున్నది (4:16).

(4) అది లవొదికయ సంఘము పౌలుకు వ్రాసిన ఒక ఉత్తరమైయుండినదని క్రిసొస్తం, మొప్సుయెస్టిస్‌కు చెందిన థియోడోర్, మరియు దియోడెరెట్ వంటి ఆది రచయితలు విశ్వసించారు. ఇది సమంజసమైన సంగతి కాదు: అది ఆయన చేతికి యింకను అందనట్లయితే, ఉత్తరము గూర్చి పౌలుకు ఎలా తెలియును?

పౌలుకు వ్రాయబడిన ఉత్తరము కొలొస్సీ సహోదరులకు ఎందుకు చదివింపబడవలెను?

లవొదికయ సంఘము చేత కూర్చబడిన ఉత్తరము పౌలు స్వయంగా వ్రాసిన ఉత్తరమునకుండు అదే అధికారమును కలిగియుండదు. ఆయన కొలొస్సయులకు వ్రాసిన ఉత్తరము లవొదికయలోని సంఘమునకు చదివి వినిపింపబడవలెనని ఆయన ఆశించుట, ఆ ఉత్తరమునకు తన అపొస్తలత్వ అధికారమున్నదని సూచించుచున్నది.

(5) ఈ ఉత్తరము లవొదికయ సంఘమునకు అందిన ఎఫెసీ, ఫిలేమోను, లేదా హెబ్రీ పత్రికల నకలైయుండినదని కొందరు విద్వాంసులు విశ్వసించుదురు. పౌలు ఫిలేమోనుకు వ్రాసిన పత్రిక కొట్టివేయబడినదని, ఎందుకనగా అది కొలొస్సయులకు అంత ప్రాముఖ్యంకాని వ్యక్తిగత విషయాలతో మాత్రమే వ్యవహరించుచున్నది. ఆ ఉత్తరము హెబ్రీయులకు వ్రాయబడిన పత్రికయని కొందరు విద్వాంసులు విశ్వసించుదురు ఏలయనగా, పౌలు దానిని వ్రాసాడని సందేహించుదురు గనుక ధర్మశాస్త్రముపై యేసు కలిగియుండిన ఔన్నత్యము గూర్చిన చర్యను బలపర్చుటకు కొలొస్సీలో చాలినంత మంది యూదా ప్రజలు ఉండినారో లేదో యని వారు ప్రశ్నించుదురు. ఆ ఉత్తరము ఆయన ఎఫెసీయులకు వ్రాసిన ఉత్తరమై యుండవచ్చును. ఎఫెసీ పత్రిక అనామికమనియు, అది పౌలు వ్రాసినదనియు, గనుక తన ప్రామాణిక గ్రంథముల జాబితాలో దానికి "లవొదికయులకు" అను శీర్షికను పెట్టియుండుననియు మార్సియోన్[12] పరిగణించుచున్నాడు; ఏదిఏమైనా, గుర్తింపబడిన ఈ సాంప్రదాయ వ్యతిరేకి చేసిన పని విషయంలో కొంత విశ్వసనీయత ఊహించుకొనబడకూడదు.

అది ఎఫెసీయులకు వ్రాయబడిన పత్రిక కాదని ఇతరులు తర్కించుదురు, ఏలయనగా ఎఫెసీ పత్రిక కొలొస్సయులకు వ్రాయబడిన పత్రిక తరువాత వ్రాయబడినదని వారు తీర్మానించుకొందురు. ఎఫెసీ పత్రిక మొదట వ్రాయబడియుండవచ్చును, కానీ దానిని తీసికొని వెళ్లువారు ఎవరును అందుబాటులో లేనందువలన అది వెంటనే అందజేయబడలేదు. ఎఫెసీయులకు వ్రాయబడిన పత్రిక ఆసియా మైనరు ప్రాంతంలో నున్న సంఘములన్నిటికిని వ్రాయబడిన ఒక సహచారియైన పత్రికయని ఇతరులు దృష్టించుదురు ఏలయనగా, "ఎఫెస్సులో నున్న పరిశుద్ధులు" అని అది సంబోధింపబడియున్నది (ఎఫెసీయులకు 1:1), ఒక నిర్దిష్ట సంఘమునకు కాదు లేదా కొన్ని చేతివ్రాతప్రతులు *en Ephesō* ("ఎఫెస్సులో") అను పదమును విడిచిపెట్టును. ఇంకా, ఎఫెస్సులో, పౌలు తన వ్యక్తిగత సందేశమును మరియు తన సహచరుల అభివందనములు మరియు వారిని గూర్చిన అనుకూల వ్యాఖ్యానములను పంపించుచుండు తన సామాన్య విధానమును అనుసరించలేదు. ఆయన ఎఫెస్సులో మూడు సంవత్సరములు బసచేసియుండినందునుబట్టి (అపొస్తలుల కార్యములు 20:31) ఆయనకు సుపరిచితులైనవారికి తన అభివందనములు లేక ఆదేశములు పంపకపోవుట ఒక అసాధారణమైన అంశముగా కనిపించుచున్నది. నిర్దిష్టమైన ప్రజల పేర్లను ఆయన ఉపయోగించి యుండకపోవచ్చును ఏలయనగా, తన ఉత్తరము, ఆయన ఎఫెస్సులో ఉంటూ సువార్తతో ఆసియా యందంతటను ఆయన చేరుకొనగలిగిన విశ్వాసులందరి కొరకు ఉద్దేశింపబడినదై యుండినది.

ఎఫెసీ పత్రిక "లవొదికయ నుండి" వచ్చిన ఒక పత్రిక యని చెప్పుటకు హెర్బర్ట్ ఎమ్. కార్సన్ తన ఋజువును ఈ విధంగా నివేదించుచున్నాడు:

> ఇది ఒక్క సంఘమునకు వ్రాయబడిన ఉత్తరము కాదు కానీ విస్తృతముగా వ్యాపించియున్న

సంఘములన్నిటికిని పంపిణీ చేయబడుట కొరకు ఉద్దేశింపబడినదని సర్వసాధారణంగా అంగీకరింపబడుచున్నది ... . ఈ ఉత్తరము ఒక స్థానిక సమస్యతో కాదు, కానీ విశాల సంఘమును ప్రభావితము చేయు సత్యములతో వ్యవహరించుచున్నది. తుకికు ఈ ఉత్తరము యొక్క వాహకుడై యున్నాడు (ఎఫెస్సీయులకు 6:21), ఈయన కొలొస్సయులకు వ్రాయబడిన పత్రికను కూడ మోసికెళ్లాడు; ఇది మరియు ఈ రెండు ఉత్తరముల నడుమ గల చెలిమి, ఈ రెండు ఉత్తరములు ఒకే సమయంలో మొదలై, ఒకే ప్రాంతమునకు చేరవేయబడినవను దృష్టికోణమును మరింత రూఢిపర్చుచున్నది. అలాగైతే, ఎఫెస్సీయులకు వ్రాయబడిన పత్రిక ఆసియా మైనరులోని సంఘములకు పంపబడియన్నట్లయితే, అది బహుశా కొలొస్సయికి పంపబడక మునుపు లవొదికయలోని బృహత్ కేంద్రమునకు చేరుకొనియుండును.[13]

ఇంతకూ, లవొదికయకు వ్రాయబడిన ఉత్తరము గతి ఏమయ్యిందోనని మనము అత్యధికంగా ఆందోళన చెందవలసిన అవసరం లేదు. ఆయన వాక్యము ఎన్నటికినీ గతించిపోదని యేసు వాగ్దానం చేసాడు (మత్తయి 24:35). మనకు ప్రస్తుతము అందుబాటులో నున్న ప్రామాణిక గ్రంథంలో మనకు అవసరమైయున్న సమస్తమును దేవుడు కాపాడి సంరక్షించుచున్నాడు. పౌలు ఉత్తరములు సకల సంఘములకు పంపిణీ చేయబడుటయే ముఖ్యము. ఆయన అధికారపూర్వకంగా రచించాడు, ఆయన రచనలు ప్రభువు ఆజ్ఞలు కలిగియున్న పత్రికలుగా అంగీకరింపబడవలెనని ఆశించాడు (1 కొరింథీయులకు 14:37). ఆది సంఘములలో పౌలు వ్రాసిన ఉత్తరముల ప్రతులుండినవనియు, అవి లేఖనములుగా అంగీకరింపబడినవనియు తెలియజేయు ఇతర సాక్ష్యము పౌలు రచనలు ఇతర లేఖనములతో సమానమైనవని పేతురు చెప్పుచున్న విషయము ద్వారా తెలియుచున్నది (2 పేతురు 3:15, 16).

### “అర్ఖిప్పుతో చెప్పుడి” (4:17బి)

ఆ తరువాత, పౌలు **అర్ఖిప్పు** గూర్చి వ్రాసాడు. ఈ పేరుకు “గుఱ్ఱమునకు యజమాని” అని అర్థము. ఫిలేమోను 2వ వచనం ప్రకారం, అర్ఖిప్పు పౌలు యొక్క “తోటి యోధుడు” అయియుండుట అధికంగా సంభావ్యమై యున్నది, ఆయన అప్ఫియతోను ఫిలేమోనుతోను మంచి సంబంధము కలిగియుండెను. అతని గూర్చి ఇంతకు మించి ఇంకేమీ తెలియదు. ఆయన ఫిలేమోను, ఒనేసిము యజమాని, మరియు కొలొస్సీ సంఘములో ఒక నాయకుడైనవాని, కుమారుడు లేదా సహోదరుడని కొందరనుకొనుచున్నారు. ఆయన లవొదికయ సంఘములో ఒక సభ్యుడై యుండవచ్చును, కానీ కొలొస్సీ సంఘములో సభ్యుడై యుండుట ఎక్కువ సంభావ్యమై యున్నది.

అర్ఖిప్పు మరియు అతని పని యెడల పౌలు కలిగియుండిన గౌరవము పౌలు వాడుచున్న “తోడి యోధుడు” అను పదజాలము ద్వారా వెల్లడిచేయబడినది (ఫిలేమోను 2). నులివెచ్చనగా నున్న లవొదికయ సంఘమునకు “దూత” లేక “వాహకుడు”గా అతనిని కొందరు గుర్తించారు (ప్రకటన 3:14). “దూత” (*angelos*) అని అనువదింపబడిన పదము ఇహలోక వాహకునిని కూడ సూచించును (మత్తయి 11:10; మార్కు 1:2; లూకా 7:21, 27; యాకోబు 2:25), గనుక అతడు నిజముగా లవొదికయ సంఘమునకు *angelos* అయియుండును. ఆయన ఖోనేలో (ప్రాచీన ప్రుగియ), ఫిలేమోను మరియు అప్ఫియతో పాటు, రాళ్లతో కొట్టి చంపబడ్డాడని సాంప్రదాయము చెప్పుచున్నది.[14]

**" 'ప్రభువునందు నీకు అప్పగింపబడిన పరిచర్యను నెరవేర్చుటకు దాని గూర్చి జాగ్రత్త పడుమని' అర్ఖిప్పుతో చెప్పుడి" (4:17)**

కొలొస్సయులకు 2:8లో వలెనే, జాగ్రత్త పడుము (*blepe*) అను మాటలు ఒక హెచ్చరికయై యుండును (గలతీయులకు 5:15; ఎఫెస్సీయులకు 5:15; ఫిలిప్పీయులకు 3:2 చూడుము). అర్ఖిప్పు పరిచర్య (*diakonia*) గూర్చిన వివరములు పౌలు ఏమియు వ్రాయలేదు, సరికదా ఈ హెచ్చరిక అతనికి ఎవరు చేయాలో కూడా నిక్కచ్చిగా చెప్పలేదు. అతడు ప్రభువు నిమిత్తము చేయుచున్న పనులలో బహుశా సంఘమంతా అతనిని ప్రోత్సాహించవలెనని పౌలు ఆశించియుండవచ్చును. అర్ఖిప్పు పరిచర్య ఎంతగా విస్తరించి యుండినదో సంఘము ఎరిగియుండినదని పౌలు భావించాడు.

అర్ఖిప్పు సేవ ఎటువంటిదై యుండెనో దాని గూర్చి పౌలు ఏమియు వ్రాయనప్పటికిని దాని విషయంలో ఆయనకుండిన ఆందోళనను అభివ్యక్తము చేసాడు. ఎడుఅర్డ్ ల్వోస్ ఇలా వ్రాయుచున్నాడు, " 'పరిచర్య' (*diakonia*) గూర్చిన భావము, సేవా కర్తవ్యమును సక్రమముగా చేయుటను వర్ణిస్తుంది, డీకను యొక్క అధికార పదవిని చేపట్టుట కాదు.[15] ఇది అలక్ష్యము చేయబడుచుండిన విధవరాండ్రకు చేయబడవలసిన "సేవ" (*diakoneō*) నిమిత్తము ఏర్పరచుకొనబడిన ఏడుగురికి సంబంధించిన అంతఃస్సూచనలు కలిగియున్నది (అపొస్తలుల కార్యములు 6:2, 3). వారు డీకనులుగా ఉండుటకు ఎన్నుకొనబడలేదు, ఏలయనగా వారి లక్షణములు వారు "ఆత్మతోను జ్ఞానముతోను నిండుకొని" యుండుటకు అవసరమైనవై యుండినవి (అపొస్తలుల కార్యములు 6:3; 1 తిమోతి 3:8–13తో పోల్చి చూడుము).

అర్ఖిప్పు యొక్క పరిచర్య అవిశ్వాసులను రక్షణ సందేశముతో చేరవలెనని ప్రయసముతో కూడిన సౌవార్తీకరణయై యుండును లేదా సభ్యులకు పరిచర్య ధర్మములను ఉపదేశించుటయై యుండును. సంఘమును పరిపూర్ణ దశకు చేర్చుచు, సంఘ వ్యవస్థను ఏర్పాటు చేయవలసిన బాధ్యతను పౌలు అతనికి ఒప్పజెప్పి యుండును, తీతుకు కూడ పౌలు ఇదే పరిచర్యను అప్పగించాడు (తీతు 1:5), లేదా ఏర్పరచుకొనబడిన ఏడుగురికి అప్పగింపబడినటువంటి ఉపకార పరిచర్య పనులను అప్పగించియుండవచ్చును. అర్ఖిప్పు వీటిలో ఏ ఒక్క పనిలో నైనను లేదా పనులన్నిటిలోను నిమగ్నమైనవాడై యుండవచ్చును.

అర్ఖిప్పు వలెనే, క్రీస్తు శరీరములోని ప్రతి సభ్యుడు వానికి అప్పగింపబడిన పనిని నమ్మకముగాను జాగ్రత్తతోను ప్రభువు నిమిత్తము చేయుటకు "జాగ్రత్త పడవలెను." "మనుష్యుల నిమిత్తముకాక, ప్రభువు నిమిత్తమని మనస్ఫూర్తిగా చేయవలెనని" పౌలు అంతకు మునుపు వారిని మందలించాడు (కొలొస్సయులకు 3:23). ప్రతి సంఘ సభ్యుడు ప్రభువు నిమిత్తము వారు చేయగల పనులను జాగరూకత చేయుచుండుటకు సభ్యులు ఒకరి నొకరు ప్రోత్సాహించుకొనుచుండవలెను.

## ముగింపు ఎత్తిచెప్పబడినది (4:18)

**[18]పౌలను నేను స్వహస్తముతో నా వందనములు వ్రాయుచున్నాను; నా బంధకములను జ్ఞాపకము చేసికొనుడి. కృప మీకు తోడై యుండును గాక.**

**"పౌలను నేను, స్వహస్తముతో నా వందనములు వ్రాయుచున్నాను" (4:18)**

కొలొస్సయులకు వ్రాయబడిన పత్రికనంతటిని **పౌలు** వ్రాసాడా, లేక ఆయన చెప్పి వ్రాయించాడా? పౌలు తన పత్రికను చెప్పి వ్రాయించిన తరువాత అభివందనములను తానే స్వయంగా వ్రాసి, సొంతంగా ఆ ఉత్తరముపై తన **స్వహస్తముతో** చేవ్రాలు చేసాడని అసంఖ్యాకమైన వ్యాఖ్యానకర్తలు అనుకొందురు. ఇది తన అపొస్తలత్వ అధికార ముద్రగా ప్రయోజనకరమయ్యింది – దొంగ సంతకం చేయబడకుండునట్లు కాపాడు సాధనమయ్యింది. ముగింపు మాటలు వ్రాసి, ఆ తరువాత ఉత్తరము చివరన/క్రింద స్వహస్తముతో చేవ్రాలు చేయు గ్రీకు మరియు రోమా ప్రభుత్వ ప్రపంచంలో సర్వసాధారణ అభ్యాసంగా ఉండినది. పౌలు తన స్వహస్తముతో చేసిన వ్యక్తిగత చేవ్రాలు మరియు అభివందనములు ఇతర పత్రికలోను కనిపించును (1 కొరింథీయులకు 16:21; గలతీయులకు 6:11; 2 థెస్సలొనీకయులకు 3:17; ఫిలేమోను 19). ఆయన పౌలు కొరకు ఉత్తరము వ్రాయుచుండెనని లేఖకుడు తెలియజెప్పిన ఒకే ఒక ఉత్తరము, తెర్తియు రోమీయులకు లిఖించిన ఉత్తరమై యున్నది (రోమీయులకు 16:22).

**"నా బంధకములను జ్ఞాపకము చేసికొనుము" (4:18)**

పౌలు పక్షముగా చేయుటకు ఆయన చేసిన ప్రార్థన మనవి సంక్షిప్తముగాను సూటియైనదిగాను ఉన్నది. ఆయన తన పరిస్థితి గూర్చి ఆందోళన చెందుచుండిన అంశాలు ఎన్నో ఉండినవి, కానీ ఆయన తన వ్యక్తిగత విషయాల పెనుభారం విశ్వాసులపై మోపకూడదనుకొన్నాడు. జ్ఞాపకము చేసుకొనుము (*mnēmoneuō*) - ఈ మాటలు యెరూషలేము సంఘపెద్దలకియ్యబడిన మందలింపులో కూడ చేర్చబడి యున్నవి: "బీదలను జ్ఞాపకము చేసుకొనుము" (గలతీయులకు 2:10). కొలొస్సయులు వారి ప్రార్థనల ద్వారా మరియు వారికి చేతనైనంత ఆర్థిక సహాయమును అందజేయుట ద్వారా కూడ ఈ పని చేయగలరు. ఫిలిప్పీలోని సంఘ సహోదరులు పౌలును జ్ఞాపకము చేసికొన్నది ఈ రీతిలోనే (ఫిలిప్పీయులకు 4:15, 16). వారు తన అపొస్తలత్వ అధికారమును గుర్తించవలెనని ఆయన వారిని అడుగుచుండెనని కొందరు వ్యాఖ్యానకర్తల మనస్సుల్లో ఉండిన తుది అభిప్రాయమును కొట్టివేయవచ్చును. పౌలు చేసిన మనవి ఆయన అదివరకే నిశ్చయపర్చుకొనిన తన అపొస్తలత్వము కాదు, కానీ తన కారాగార నిర్బంధమునకు సంబంధించినదై యుండినది (1:1).

**"కృప మీకు తోడైయుండునుగాక" (4:18)**

ఆయన వ్రాయుచుండిన తన ఉత్తరముల ఆరంభంలోను ముగింపులోను దేవుని లేదా యేసు క్రీస్తు **కృప** తన పత్రికలను చదువువారికి తోడైయుండవలెనని తన అంతరంగములో

నెలకొనియుండిన ఆకాంక్షను దాదాపుగా ప్రతిసారి తెలియజేయుట పౌలుకు ఒక సర్వసాధారణమైన అభ్యాసమై యుండినది.[16] తోటి విశ్వాసుల కొరకైన తన ప్రేమ మరియు ఆందోళనలో ఉన్న గొప్పతనమును మరియు దేవుని మంచితనముపై ఆయన ఆధారపడుచున్నాడను నగ్నసత్యమును చూపించుట ద్వారా ఈ ఉత్తరమును ముగించాడు. ఈ విధంగా, ఆయన తన చదువరుల గూర్చి కలిగియుండిన ఆసక్తిని వెల్లడించాడు. తన చదువరులను దేవుడు మెండుగా ఆశీర్వదించాలనియు వారిపై ఆయన తన అనుగ్రహములను కుమ్మరించాలనియు కలిగియుండిన నిరీక్షణను వ్యక్తముచేయుచు ఈ ఉత్తరమును ముగించుట అదొక సముచితమైన విధానమై యుండినది.

## అన్వయము

**క్రీస్తు కొరకు కలిసి పనిచేయుట (4:10–14)**

పౌలు యొద్ద ఆయనతో కూడ ఇద్దరు వ్యక్తులుండిరి. వారు ఇదివరకు తాము చేసిన తప్పుల నుండి కోలుకొన్నవారై యుండిరి. ఒనేసిము, ఒక దాసుడు (బానిస), తన యజమానుని విడిచిపెట్టి వెళ్లిపోయాడు. పౌలు అతనిని కలుసుకొన్నాడు, అంతటితో ఆగిపోక అతనిని ప్రభువు యొద్దకు నడిపించాడు. సువార్తను ప్రకటించుచుండు సందర్భములలో ఒనేసిము ఆయనకు సహాయము చేయునట్లు వాని యజమానుడైన ఫిలేమోను యొద్ద పౌలు అనుమతి కోరియుండవచ్చును. రెండవ వ్యక్తి – మార్కు. ఈయన, పౌలు మరియు బర్నబా మొదటి మిషనరీ ప్రయాణముపై వెళ్లినప్పుడు వారితో చేరినవాడు, అటుతరువాత పెర్గే యొద్ద వారిని విడిచిపెట్టి తన ఇంటికి తిరిగి వచ్చాడు (అపొస్తలుల కార్యములు 13:13). ఆ తరువాత, రెండవ మిషనరీ ప్రయాణమునకు మార్కును తనతో కూడ తీసికొనివెళ్లుటకు పౌలు నిరాకరించాడు (అపొస్తలుల కార్యములు 15:38), కానీ మార్కు పౌలు యొక్క నమ్మకమును మరొక పర్యాయము సంపాదించుకొని, ఆయనకు ఒక గొప్ప ప్రోత్సాహముగా ఉండినాడు.

*ప్రజలు వారి గతమునుండి కోలుకొనగలరు.* పేతురు, యేసు ప్రభువును ఎరుగనని ముమ్మారు బొంకినవాడు, ఒక విశిష్టమైన అపొస్తలుడయ్యాడు. మగ్దలేనే మరియు, ఆమెను ఏడు దయ్యములు పట్టియుండినప్పటికిని, ఆమె యేసుకు ఒక విశ్వసనీయమైన అనుయాయురాలయ్యింది (లూకా 8:2). వారిలో కొందరు అనైతికముగా ప్రవర్తించుచుండిరని పౌలు కొరింథులో నుండిన క్రైస్తవులకు గుర్తుచేసాడు (1 కొరింథీయులకు 6:9–11).

యేసు సుంకరులతో పాపులతోను సంబంధము పెంచుకొన్నాడు (మత్తయి 9:10, 11; 11:19). ప్రజలు లేదా ఒక వ్యక్తి ఏమైయుండిరో లేక ఏమైయున్నారో అను విషయము గూర్చి కాదు, కానీ వారు ఆయన కొరకు ఏమి కాగలరో అను సత్యము గూర్చి యేసు ఎక్కువ ఆందోళన చెందుచున్నవాడై యుండెను. వ్యభిచారములో పట్టబడిన స్త్రీని చూచి, ఆమెపై దోషారోపణ చేసినవారంతా వెళ్లిపోయిన తరువాత, "నేనును నీకు శిక్ష విధింపను, నీవు వెళ్లి, ఇక పాపము చేయకుము" అని పలికాడు (యోహాను 8:11).

యేసు మన జీవితములను మార్చివేయగలడు, అంతేకాక ఆయన కొరకు విశ్వసనీయమైన సేవకులనుగా మనలను తీర్చిదిద్దగలడు. నూతనముగా యేసుక్రీస్తునంగీకరించువారికి విరోధముగా వారి గత అపరాధములను మనము మన మనస్సుల్లో ఉంచుకొనకూడదు. దేవుని

సహాయంతో, వారు ఆయన పనుల నిమిత్తము గొప్ప ప్రయోజకులు కాగలరు. ఇతరులు ఏమైయున్నారో లేక ఏమైయుండిరో కాదు, కానీ వారు ఏమి కాగలరో అను విషయము గూర్చి మనము ఎక్కువగా చింతించుచుండవలెను.

*ఒకరి నేపథ్యమేదైనా, సమస్త జనులు సామరస్యముగా పనిచేయగలరు.* వారు యేసు అనుచరులగుట వలన కలిగిన ఫలితము ఇదే. ఇదే సత్యము యేసుక్రీస్తును వెంబడించువారందరి విషయములోను నిజమగును. మనమందరమును ఒక్క శరీరములోనికి బాప్తిస్మము పొందాము (1 కొరింథీయులకు 12:13). మనము క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందినప్పుడు, యూదుడని, గ్రీసుదేశస్థుడని వర్గీకరణముండదు, ఏలయనగా మనమందరము "యేసు క్రీస్తునందు ఏకముగా ఉన్నాము" (గలతీయులకు 3:27, 28).

జాతి మరియు నేపథ్యంతో నిమిత్తము లేకుండా, మనము యేసు కొరకు సామరస్యముగా పనిచేయవలెను. యేసు క్రీస్తు ధర్మశాస్త్రమును రద్దుచేయుట ద్వారా, యూదులకును అన్యజనులకును మధ్య అడ్డుగా నిలిచియుండిన గోడను కూల్చివేసాడు. ఆయన సిలువ మరణము ద్వారా మనలందరిని ఒక్క శరీరముగా దేవునితో సమాధానపరచునట్లు యేసు ఈ కార్యము చేసాడు (ఎఫెసీయులకు 2:14-16).

*మన దృష్టి అంతా దేవుని రాజ్యము మీద కేంద్రీకరించబడి యుండవలెను.* పరిశుద్ధ సత్యవేదము యొక్క ప్రధాన ఇతివృత్తములలో దేవుని రాజ్యము ఒకటై యున్నది. దేవుని రాజ్యము రోమా ప్రభుత్వ కాలములో స్థాపింపబడునని దానియేలు ప్రవచించాడు. దేవుని (పరలోక) రాజ్యము ప్రారంభము కానున్నదని యోహాను, యేసు, అపొస్తలులు, మరియు డెబ్బదిమంది బోధించారు (మత్తయి 3:2; 4:17; 10:7; లూకా 10:9, 11).

యేసు పరలోకమునకు తిరిగి వెళ్లక మునుపు చివరిసారిగా సంబోధించిన సంగతి దేవుని రాజ్యమును గూర్చినదై యున్నది (అపొస్తలుల కార్యములు 1:4-8). సమరయులకు ఫిలిప్పు చేరవేసిన సందేశము దేవుని రాజ్యమును గూర్చినదై యున్నది (అపొస్తలుల కార్యములు 8:12). అపొస్తలుల కార్యముల గ్రంథంలో పౌలు చివరిసారిగా పేర్కొనబడినప్పుడు, ఆయన దేవుని రాజ్యము గూర్చి ప్రబోధించుచుండెను (అపొస్తలుల కార్యములు 28:31), అదే ఆయన పరిచర్యకు ఆస్కారమును భారమునయ్యింది (అపొస్తలుల కార్యములు 20:25).

దేవుని రాజ్యము యొక్క విలువ ఒకడు పొలములో కనుగొనిన ధననిధి వంటిదై యున్నది. అది గొప్ప వెలగల ముత్యమువంటిదై యున్నది: దానిని కనుగొన్నవాడు దానిని వాని సొంతం చేసికొనగలుగునట్లు వానికున్నదంతా అమ్ముకున్నాడు (మత్తయి 13:44-46). దేవుని రాజ్యము యొక్క గొప్పతనమును బట్టి, దాని విస్తరణ నిమిత్తము మనము మన జీవితములను అంకితము చేసికొనవలెను, మరియు అర్పించుకొనవలెను, అప్పుడు యేసు, రాజ్యమునేలుచుండు రాజు, ఆదరింపబడినవాడగును మరియు మనము ఆయనకు లోబడినవారమగుదుము.

పౌలు కూడ ఉండినవారివలె, మనము దేవుని రాజ్యములో తోటిపనివారమై యుండగలము. వారు ఏకభావము గలవారై యుంటూ సువార్త ప్రబోధకులలో ఏ ఒక్కరి పక్షమునకే చెందినవారివలె ఉండకూడదని పౌలు (1 కొరింథీయులకు 1:10-13), వారు క్రీస్తు కొరకు జతపనివారై యుండవలెను (1 కొరింథీయులకు 3:9), వారందరు ఏపక్షము వహించినవారై యుండిరి. ఈ హేతువునుబట్టియే, వారు ఇతరులను గాని క్రీస్తును గాని మినహాయించుచు ఏదో ఒక్క ప్రబోధకుని పక్షము వహించినవారై యుండకూడదు.

దేవుని రాజ్యములో పనిచేయువారి మధ్య తరుచుగా పోటీ తత్వము, అసూయ, మరియు కలహము ఉండును. మన పోరాటము మనలోనే ఒకరికి విరోధముగా మరొకరము పోరాడుచున్నదిగా కాదు, కానీ మన బద్ధశత్రువు, అపవాది, మరియు వానిని సేవించువారికి విరోధముగా జరుగుచున్న పోరాటమై యుండవలెను (ఎఫెసీయులకు 6:11, 12).

క్రీస్తు కొరకు కలిసి పనులు చేయునప్పుడు, మనము బహు ప్రయాసముతో సేవించుచుండవలెను. ఆయన మనలను మన గత పాపముల నుండి రక్షించాడని మనము ఎరిగినవారమై, ఒకరితో నొకరము ఏకీభవించుచు, మన దృష్టినంతా దేవుని రాజ్యముపై కేంద్రీకరించుచు సామరస్యముతో పనులు చేయుచుండవలెను.

**నమ్మకమైన సహచరులు (4:10-14)**

ఆయనతో కూడ పనిచేసిన వారికి సంబంధించినంత వరకు పౌలు నిర్మాణాత్మకమైన ప్రకటనలు చేసాడు. మనము మన తోటి క్రైస్తవుల గూర్చి వారి మంచితనమునే చెప్పుకొనుచు మన గూర్చి కూడ ఇతరులు మంచినే మాటలాడుకొనునట్లు మనలను మనము నిర్వహించుకొనుచుండవలెను. ఇతరులు వారిని పోలి నడుచుకొనుటకు పౌలు సహచరులు వారికి మంచి మాదిరులై యున్నారు.

*నమ్మదగిన స్నేహితుడు.* ఎఫెస్సు పట్టణంలో ఆగ్రహము చెందిన జనసమూహము చేత నాటకశాల లోనికి ఈడ్చుకొనిపోబడినప్పటికిని నమ్మకమైనవాడుగా నిలిచియుండిన ఒక క్రైస్తవుని గూర్చి చెప్పుకొనుటకు, అరిస్తార్కు ఒక మాదిరియై యున్నాడు (అపొస్తలుల కార్యములు 19:29). ఆయన పౌలుతో కూడ ప్రయాణం చేసాడు (అపొస్తలుల కార్యములు 20:4) మరియు పౌలు చెరసాలలో ఉంచబడినప్పుడు సహితము ఆయనతో కూడ ఉన్నాడు (అపొస్తలుల కార్యములు 27:2). అరిస్తార్కు నమ్మకమైన స్నేహితుడు ప్రతి విశ్వాసికి అవసరమై యున్నాడు. గనుక ఇతరులకు నమ్మదగిన స్నేహితులముగా నుండుటకు మనము ప్రయాసపడుదము.

*పరిపూర్ణమైన సహోదరుడు.* ఆధారరహితమైన యౌవ్వనుడై యుండిన మార్కు ప్రభువు కొరకు ప్రయోజనకరమైన దాసుడుగా నుండుటకు పరిపూర్ణత చెందినవాడై యుండెను. యేసుకు దాసులై యుండుటకు యౌవ్వన కాలములో చేయబడిన పొరపాట్లు ఏ విధంగాను ఒక ఆటంకముగానుండునట్లు ఏ ఒక్కరును అనుమతించకూడదు. ఈ ధోరణిలో అభివృద్ధిచెందువారు అంగీకరింపబడుచు వారి ఎదుగుదలనుబట్టి ప్రశంసింపబడుచున్నవారై యుండవలెను.

*మరొక ప్రోత్సాహకుడు.* ఇతరులతో కూడ, యేసు అనుచరుడగునట్లు తన పూర్వపు మతమును వదిలిపెట్టిన వారిలో ఒకడనిపించుకొనుటకు యూస్తు ఒక ఉదాహరణమై యున్నాడు. తన యూదీయ వారసత్వమును వదిలిపెట్టిన తరువాత, ఇతరులు యేసు గూర్చి నేర్చుకొనునట్లు వారికి సహాయం చేయుటలో ఆయన దాదాపుగా జోక్యము కలుగజేసుకొన్నవాడయ్యాడు. ఆయన మరియు ఇతరులు వారి మతమును మార్చుకొనుట మాత్రమే కాదు, కానీ వారు ప్రభువు యొక్క విశిష్టమైన సేవకుడై యుండిన పౌలును సహితము ప్రోత్సాహించారు.

*సుస్థిరముగా కట్టుబడియుండిన దాసుడు.* ఎపఫ్రాను ఒక “సంఘటిత శ్రామికుడు” అని

పిలువవచ్చును. తన సొంతం కొరకు కాదు, కానీ ఇతరుల శ్రేయస్సు కొరకు పనిచేసినవానికి ఆయన ఒక మంచి మాదిరియై యున్నాడు. ఆయన గూర్చి పౌలు ఈ క్రింది విషయాలను వెల్లడిపరచాడు:

(1) ఆయన ఒక కట్టుబడియుండిన దాసుడుగా/బానిసగా, యేసును సేవించాడు (1:7; 4:12). మనము మనకే చెందినవారము కాము, ఏలయనగా మనము యేసు రక్తములో కొనబడినవారమై యున్నాము (అపొస్తలుల కార్యములు 20:28; 1 కొరింథీయులకు 6:19, 20). ఇందు మూలమున, మనము చేయుచుండు, చేయదలచు ప్రతి విషయములోను దేవుని చిత్తమును వెదకవలసినవారమై యున్నాము. విశ్వసనీయమైన సేవ కావలసియున్నది. సరైన విషయమును పలుకుట ముఖ్యమే, కానీ సరైన పనులు చేయుట అత్యావశ్యకమై యున్నది (మత్తయి 7:21; లూకా 6:46).

(2) ఆయన ఇతరుల కొరకు మనఃపూర్వకముగా శ్రమించాడు. నిస్వార్థ సేవకు అంతిమ మాదిరి, యేసే. ఆయన తనను తాను సంతోషపర్చుకొనుటకు వెదకలేదు, దానికి బదులుగా, ఆయన ఇతరులకు పరిచారము చేయుటకే వెదకాడు (రోమీయులకు 15:3). ఈ విశాల విశ్వమంతటికిని ఆయనే యజమానియై యున్నప్పటికిని, ఆయన తనను తాను తగ్గించుకొన్నాడు, దాసుని ధరించాడు (మత్తయి 20:25-28; ఫిలిప్పీయులకు 2:7). క్రైస్తవులు కూడ ఇదే విధముగా సేవలు చేయుటకు నేర్చుకొనవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

(3) ఆయన ఇతరుల గూర్చి ఆందోళనచెందుచుండెను. కొలొస్సయులకు కొరకైన ఎపఫ్రా సేవలు ఆయన వారి శ్రేయస్సు గూర్చి కలిగియుండిన ఆసక్తిలో నుండి అంకురించి పెల్లుబికినవి. హార్థిక సేవలు అందించబడకమునుపు, అట్టి సేవలు అందించబడవలసియున్న వారి గూర్చి స్వతఃస్సిద్ధమైన ఒక ఆందోళన ఉండవలెను. పౌలుతో కూడ నుండిన ఆయన జత పనివారు ఆయా సంఘముల గూర్చి ఒక ప్రత్యేకమైన ఆసక్తిని కనుపర్చినట్లు కనబడుచున్నది. ఎపఫ్రా యొక్క ప్రధాన చింత కొలొస్సయిలోని సంఘమును గూర్చినదై యుండినది, ఈ సంఘ స్థాపనలో ఆయన కూడ బహుగా శ్రమించినందుకును, అచ్చటి సహోదరుల మధ్య సేవ చేసినందుకును కాబోలు ఆయన ఇంత ఆసక్తి కలిగియున్నాడు.

(4) ఆయన ఇతరుల కొరకు మనఃపూర్వకముగా ప్రార్థించాడు. ఎపఫ్రా ఎల్లకాలము కొలొస్సయులతోనే ఉండలేదు, కానీ ఆయన వారికి సహాయము చేయుటకు తన శాయశక్తులా ప్రయాసపడ్డాడు. ముఖ్యంగా ప్రేమించువారికి మనము సహాయము చేయగలుగుటకు ఇదే ఒక ఉత్తమమైన మార్గమై యుండును.

*తారతమ్యములు గల అన్నతమ్ముళ్లు.* లూకా జీవితమును దేమా జీవితముతో పోల్చవచ్చును. యేసు మరియు పౌలు యెడల లూకా నమ్మకమైనవాడుగా నిలిచియుండినాడు, కానీ దేమా ఇహలోకమును ప్రేమించుటనుబట్టి పౌలును విడిచిపెట్టి వెళ్లిపోయాడు (2 తిమోతి 4:10, 11). మానవులు స్వేచ్ఛాజీవులు; మనకిష్టమైన దానిని ఎంపిక చేసికొనుటకు దేవుడు మనకు స్వతంత్రము నిచ్చాడు. పౌలుతో, యేసు దాసులలో ఒక గొప్ప దాసుడైనవానితో, కలిసి పనిచేసిన తరువాత కూడ, దేమా విశ్వాసఘాతకుడయ్యాడు. అదేవిధంగా, యూదా యేసును అప్పగించాడు. పౌలు చేయుచున్న హెచ్చరికను ప్రతి క్రైస్తవుడు శ్రద్ధగా గమనించవలెను: “తాను నిలుచున్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెను”

(1 కొరింథీయులకు 10:12).

"ఈ లోక స్నేహము"లో ధనాపేక్ష, స్వార్థప్రియము, సుఖానుభవము మొ॥ కలవు (1 తిమోతి 6:10; 2 తిమోతి 3:2, 4). ఈ అపాయముల సారాంశము 1 యోహాను 2:15, 16లో ఈ విధంగా ఉన్నది:

> ఈ లోకమునైనను లోకములో ఉన్నవాటినైనను ప్రేమింపకుడి. ఎవడైనను లోకమును ప్రేమించిన యెడల, తండ్రి ప్రేమ వానిలో నుండదు. లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశము నేత్రాశయు జీవపుడంబమును తండ్రి వలన పుట్టినవి కావు, అవి లోకసంబంధమైనవే.

**"పరిచర్య గూర్చి జాగ్రత్తపడుము" (4:15–18)**

పౌలు యొక్క వ్యక్తిగత అభివందనములలో, ఈ ఉత్తరము లవొదికయలో నున్న సంఘమునకు చదువు వినిపింపబడవలెనని ఆయన విన్నవించుకొన్నాడు. అతనికి అప్పగింపబడిన పరిచర్యను అర్ఖిప్పు నెరవేర్చుటకు అతనిని ప్రోత్సాహించవలెనను ఉద్దేశముతో పౌలు అర్ఖిప్పును ప్రత్యేకించుకొన్నాడు.

*సంఘమును గూర్చిన చింత.* పౌలు మనస్సులో క్రీస్తు సంఘముల గూర్చిన సార్వత్రిక ఆసక్తి ఉండినది, ఈ సంఘములలో ఆయన సందర్శించనివి కూడ ఉన్నవి. కొలొస్సయులకు వ్రాసిన వీడ్కోలు అభివందనములలోను ఆయన తన ఉత్తరములో అంతకు మనుపు చేసిన ప్రకటనలోను ఇది స్పష్టమగుచున్నది: "మీ కొరకును, లవొదికయ వారి కొరకును, శరీర రీతిగా నా ముఖము చూడనివారందరికొరకును, నేను ఎంతగా పోరాడుచున్నానో మీరు తెలిసికొనగోరుచున్నాను" (కొలొస్సయులకు 2:1). ఆయన కొరింథీయులకు వ్రాసిన పత్రికలో, ఆయన ఎదుర్కొనిన శారీరక కష్టములను పేర్కొనిన తరువాత, "ఇవియును గాక సంఘములన్నిటి గూర్చిన చింతయు కలదు. ఈ భారము దినదినమును నాకు కలుగుచున్నది" అని చెప్పుచు ముందుకు సాగాడు (2 కొరింథీయులకు 11:28).

సంఘముల గూర్చిన ఇదే చింత మరియు ఆసక్తి మనము కూడ కలిగియుండవలెను. మనము క్రైస్తవుల స్థానిక కుటుంబములో ఒక భాగము మాత్రమే కాదు, కానీ విశ్వాసుల విశాల సహవాసములో సహితము, యేసే శిరస్సైయున్న ఒక్క శరీరములో సహితము, సభ్యులమై యున్నాము.

మనమందరము ఇహలోకమందలి దేవుని కుటుంబములో సభ్యులమై యున్నాము గనుక అందరమును పరలోక సైన్యసమూహముతో పరలోకములో దేవుని పరలోక కుటుంబముగా కలిగి యుందుము (ఎఫెసీయులకు 3:15; కేవలము మరొకచోట, లూకా 2:4; అపొస్తలుల కార్యములు 3:25). ఇందునుబట్టి, మనమందరమును పనులు చేయుచు ప్రపంచమందలి ప్రతి చోట ఉన్న విశ్వాసులందరి నిమిత్తము ప్రార్థించుచుండవలెను. స్థానిక సంఘము మనలో నున్న గొప్ప రాజభక్తిని మరియు నిష్టను సద్వినియోగము చేసికొనును, కానీ మనము యేసుక్రీస్తు యొక్క సమస్త ప్రజల గూర్చిన ఆసక్తిని చూపుచుండవలెను. ఇతర స్థలములలో నున్న క్రీస్తునందలి సంఘములు రోమాలో నున్న సంఘము గూర్చి ఎరిగియుండెను గనుక వారు తమ అభివందనములు పంపించారని పౌలు సూచించాడు (రోమీయులకు 16:16). సార్వత్రికమైన క్రీస్తు శరీరమంతటి గూర్చిన చింత కలిగియుండుటలో ఆది

సంఘము అగుపరచిన మాదిరిని మనము కూడ అనుకరించినట్లయితే మనము మంచి చేయుచున్నవారమౌదుము.

*వాక్యమునకు గల అధికారమును గౌరవించుట.* పౌలు వ్రాసిన ఉత్తరములు మొదటి శతాబ్దము నాటి క్రీస్తు సంఘములకు ఎంతో ప్రాముఖ్యమైనవై యుండినవి గనుక వాటి అధికారము గూర్చిన గౌరవము నేడు మనకు కూడ అంతే ప్రాముఖ్యమైనదై యుండవలెను. ఆయన రచించి ఆయా సంఘములకు పంపిన పత్రికలు పంచుకొనబడవలెననియు, అవి చదివి వినిపింపబడవలెననియు ఆయన చేయుచున్న మనవి, అవన్నీ కూడ ఎంతో ప్రాముఖ్యమైనవని పౌలు అర్థంచేసికొన్నాడని మనము అర్థంచేసికొనవలెను.

పౌలు తనకందింపబడిన సందేశమును మానవుల నుండి కాదు, కానీ యేసుక్రీస్తు నుండి పొందుకొన్నాడు (గలతీయులకు 1:11, 12). ఆయన వ్రాసి పంపిన ఉత్తరములు, యేసు క్రీస్తు చేత పరిశుద్ధాత్మ ద్వారా ఆయనకు బయలుపరచబడినవి, గనుక అవి చదువబడి గ్రహింపబడవలెను (2 కొరింథీయులకు 1:13; ఎఫెసీయులకు 3:3-5). అవి మానవుల లేక పౌలు ఆలోచనలను మించినవై యున్నవిగా గుర్తింపబడవలెను; వాటిని క్రీస్తు ఆజ్ఞలుగా అంగీకరింపవలెను (1 కొరింథీయులకు 14:37).

పౌలు పత్రికలు ఆయన కియ్యబడిన జ్ఞానమునకు ఫలితములై యున్నవని పేతురు గుర్తించి వాటిని అంగీకరించాడు. అవి దేవుడనుగ్రహించిన లేఖనములై యున్నవనియు, ఇతర లేఖనములకున్న సమాన అధికారము అవి కూడ కలిగియున్నవనియు వాటిపై ఆయన తన ఆమోద ముద్ర వేసాడు (2 పేతురు 3:15, 16).

పౌలు పత్రికలకు మనము సంఘములలో అదే అధికార హోదాను ఇవ్వవలెను. క్రైస్తవుల వాటిని చదువవలెను, అధ్యయనము చేయవలెను, వాటికి లోబడవలెను, ఏలయనగా అవి యేసు ఆజ్ఞలు కలిగియున్నవి. మనము మత్తయి, మార్కు, లూకా, మరియు యోహాను వ్రాసిన సువార్తల నివేదికలలోని యేసు వాక్కులకు ఇచ్చు గౌరవమును వాటికిని ఇయ్యవలెను.

*దేవుడు మనకిచ్చిన తలాంతులను ఆయన మహిమ కొరకు శ్రద్ధతో ఉపయోగించుట.* అర్ఖిప్పు అతనికి అప్పగింపబడిన పరిచర్యను నెరవేర్చవలెనని పౌలు అతనిని విన్నవించుకొన్నాడు. అదే మనవి - మనలను మనము సంపూర్ణముగా యేసు పరిచర్యలో నిమగ్నము చేసికొనవలెనని మనవి - మనకందరికిని చేయబడుచున్నది. అయితే మనమందరమును ఒకేరీతిలో సేవించవలెనని లేదా సేవించగలమని కోరబడలేదు.

మరొక చోట, ఆది క్రైస్తవులకు అనుగ్రహింపబడిన వ్యక్తిగత సామర్థ్యముల గూర్చి పౌలు మాటలాడుచున్నాడు. “ఆయన కొందరిని అపొస్తలులనుగాను, కొందరిని ప్రవక్తలనుగాను, కొందరిని సువార్తికులను గాను, కొందరిని కాపరులనుగాను ఉపదేశకులనుగాను నియమించెను” (ఎఫెసీయులకు 4:11). పరిచర్య ధర్మమునకు సంబంధించిన ఇటువంటి హోదాలు పరిచర్యల విషయములో సహాయము చేయుచు క్రీస్తు శరీరమును (సంఘమును) బలముగా నిర్మించవలెనని ఉద్దేశింపబడినవారికి మాత్రమే ఇయ్యబడినవి (ఎఫెసీయులకు 4:12). ఈ కార్యభారములలో క్రీస్తు శరీరములోని సభ్యులందరును లేరు.

అందరు అపొస్తలులు, లేక ప్రవక్తలు, లేక ఉపదేశకులు కారు (1 కొరింథీయులకు 12:29). అపొస్తలులు సంఘము యొక్క పునాదియై (ఎఫెసీయులకు 2:20), అదివరకే వేయబడిన పునాదియై యున్నారు. గనుక నేడు మనము, ఆది సంఘము అపొస్తలుల

బోధయందు కొనసాగినట్లుగానే (అపొస్తలుల కార్యములు 2:42), వేయబడిన పునాది మీదనే కట్టుచుండవలెను. పరిశుద్ధాత్మ ద్వారా దేవుని వాక్యము అనుగ్రహింపబడిన వారే (ఎఫెసీయులకు 3:5). ప్రతి ఒక్కరు ఉపదేశకుడై యుండవలనని కోరబడుట లేదు (యాకోబు 3:1). ఒకడు ఉపదేశించుటకు మొదలుపెట్టకమునుపు, వాడు ఉపదేశించగలుగునట్లు సిద్ధము చేయబడవలెను (హెబ్రీయులకు 5:12).

వారు క్రీస్తు కొరకు చేయగల సేవలలో శ్రద్ధాభక్తులతో కలుగజేసుకొనవలెనని పౌలు రోమా పట్టణంలోని విశ్వాసులను విన్నవించుకొన్నాడు.

> మనకనుగ్రహింపబడిన కృపచొప్పున వెవ్వేరు కృపావరములు కలిగినవారై యున్నాము గనుక, ప్రవచనవరమైతే విశ్వాస పరిమాణము చొప్పున ప్రవచింతుము; పరిచర్యయైతే, పరిచర్యలోను; బోధించువాడైతే, బోధించుటలోను; హెచ్చరించువాడైతే, హెచ్చరించుటలోను పని కలిగియుందము; పంచిపెట్టువాడు, శుద్ధమనస్సుతోను; పైవిచారణ చేయువాడు, జాగ్రత్తతోను; సంతోషముతోను పని జరిగింపవలెను (రోమీయులకు 12:6–8).

మనము చేయగల సేవా అవకాశములను కనుగొని వాటిని మన శాయశక్తులా నెరవేర్చవలెనని కోరబడుచున్నాము. “సహోదర ప్రేమ విషయములో ఒకనియందొకడు అనురాగము గలవారై; ఘనత విషయంలో ఒకని నొకడు గొప్పగా ఎంచుకొనుడి; ఆసక్తి విషయములో మాంద్యులు కాక, ఆత్మయందు తీవ్రత గలవారై ప్రభువును సేవించుడి” అని పౌలు వ్రాయుచున్నాడు (రోమీయులకు 12:10, 11).

అర్ఖిప్పుకియ్యబడిన సవాలును మనము వ్యక్తిగతముగా తీసికొనవలసియున్నది: “ప్రభువునందు నీకు అప్పగింపబడిన పరిచర్యను నెరవేర్చుటకు దాని గూర్చి జాగ్రత్తపడుము” (కొలొస్సయులకు 4:17). ప్రతి క్రైస్తవుడు అతి జాగ్రత్తగా ఆలోచించుటకు ఇదొక సముచితమైన మందలింపై యున్నది.

ముగింపులో క్లుప్తంగా చెప్పుకొంటే, మనము క్రీస్తు శరీరములో సభ్యులైయున్న వారందరి గూర్చిన ఆసక్తి కలిగియుంటూ దానిని కనుపరుచుచుండవలెను. పౌలు ఇచ్చిన ఆదేశములు క్రీస్తు చేత బలపర్చబడుచున్నవి గనుక అవి క్రీస్తు ఆజ్ఞలు కలిగియున్నవని మనము వాటిని గౌరవించవలెను. మనమందరమును ఒకే విధమైన సేవ చేయవలెనని, లేదా చేయగలమని ఆశింపబడలేదు, కానీ మనము ఏయే విషయములలో ఉత్తమోత్తముగా ఆయనను సేవించగలమో ఆయా విషయాలలో యేసు కొరకు మన శాయశక్తులా ప్రయాసపడుటకు శ్రద్ధగలవారమై యుండవలెను.

---

సూచనలు

[1]David M. Hay, *Colossians*, Abingdon New Testament Commentaries (Nashville: Abingdon Press, 2000), 156. [2]మత్తయి 10:13, 14, 41; మార్కు 6:10, 11; లూకా 9:4, 5; 10:8; హెబ్రీయులకు 11:31. [3]1 కొరింథీయులకు 6:9, 10; 15:50; గలతీయులకు 5:21; ఎఫెసీయులకు 5:5; 1 థెస్సలొనీకయులకు 2:12 చూడుము. [4]లూకా 13:24; యోహాను 18:36; 1 కొరింథీయులకు 9:25; కొలొస్సయులకు 1:29; 1 తిమోతి 6:12; 2 తిమోతి 4:7 చూడుము. [5]రోమీయులకు 5:2; 11:20; 14:4; 1 కొరింథీయులకు 7:37; 10:12; 15:1; 2 కొరింథీయులకు 1:24; ఎఫెసీయులకు 6:11, 13, 14 చూడుము. [6]రోమీయులకు 16:5, 8, 9, 12; ఎఫెసీయులకు 6:21; కొలొస్సయులకు 1:7;

4:7, 9; 2 తిమోతి 1:2; ఫిలేమోను 1, 2, 16. [7]అపొస్తలుల కార్యములు 16:10-17; 20:5-15; 21:1-18; 27:1-8, 15-20, 27-29, 37; 28:1, 2, 10-16. [8]Eusebius *Church History* 3.4; Jerome *On lllustrious Men* 3.7. [9]R. T. A. Murphy, "Luke, Evangelist, St.," in *New Catholic Encyclopedia*, 2d ed., ed. Thomas Carson and Joann Cerrito (New York: Thomas Gale, 2003), 8:856. [10]Jerome *On lllustrious Men* 5.

[11]A. F. Walls, "Apocryphal Epistles," in *The International Standard Bible Encyclopedia*, rev., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1979), 1:180. [12]కనీసము నాలుగవ శతాబ్దము వరకైనా బ్రతికి బయటపడిన ఒక క్రైస్తవ మతశాఖ వ్యవస్థాపకుడైన మార్సియోన్, ఒక జ్ఞానవాది యనియు సిద్ధాంత వ్యతిరేకియనియు క్రీ.శ. 144లో సంఘము నుండి బహిష్కరింపబడ్డాడు. సువార్తల నివేదికలలోని మూడింటిని ఆయన తృణీకరించనందు వలన, క్రొత్త నిబంధనలోని ప్రామాణిక గ్రంథములలో వేటిని అంగీకరించవలెనో యని నిర్వచింపవలసిన పరిస్థితి సంఘమునకు తప్పనిసరయ్యింది. [13]Herbert M. Carson, *The Epistles of Paul to the Colossians and Philemon: An Introduction and Commentary*, The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1960), 101-2. [14]D. E. Hiebert, "Archippus," in *The Zondervan Pictorial Encyclopedia of the Bible*, ed. Merrill C. Tenney (Grand Rapids, Mich.: Zondervan Publishing Co., 1975), 1:287. [15]Eduard Lohse, *Colossians and Philemon,* trans. William R. Poehlmann and Robert J. Karris, Hermeneia (Philadelphia: Fortress Press, 1971), 175, n. 50. [16]రోమీయులకు 1:2-7; 16:20, 24; 1 కొరింథీయులకు 1:2; 16:23; 2 కొరింథీయులకు 1:2; 13:14; గలతీయులకు 1:3; 6:18; ఎఫెసీయులకు 1:2; 6:24; ఫిలిప్పీయులకు 1:2; 4:23; కొలొస్సయులకు 1:2; 4:18; 1 థెస్సలొనీకయులకు 1:1; 5:28; 2 థెస్సలొనీకయులకు 1:2; 3:17; 1 తిమోతి 1:2; 6:21; 2 తిమోతి 1:2; 4:22; తీతు 1:2-4; 3:15; ఫిలేమోను 3, 25.